విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 | సంచిక :143 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శనివారం 10 అక్టోబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



- రైతులు పంట గురించి ఆలోచించాలే తప్ప ఆందోళన చెందకూడదు:
- నర్సింగోలులో చంద్రబాబు ప్రసంగం
- ప్రకాశం జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు
- 'మీ భూమి–మీ హక్కు' కింద రాజముద్రతో కొత్త పాస్‌బుక్‌ల పంపిణీ
- రూ.166 కోట్లతో పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్‌కు శంకుస్థాపన
- అధికారుల పనితీరుపై బహిరంగంగా సమీక్ష.. పనితీరు మెరుగుపరుచుకోవాలని ఆదేశం
- బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించిన ముఖ్యమంత్రి

**అమరావతి**

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా పాలన సాగిస్తామని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం నర్సింగోలులో శుక్రవారం ఆయన పర్యటించి, 'మీ భూమి – మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రైతు పొలంలో పంట గురించి ఆలోచించాలి గానీ, తన భూమి భద్రతపై వివరాలు 2లో..

# "ఓట్ల దొంగతనం" జరుగుతోంది

- "ఓట్ల దొంగతనం"పై రాష్ట్రపతికి ఫిర్యాదు చేసిన విపక్షాలు
- ఆరోపణలకు ఆధారాలు సమర్పించాలని రాష్ట్రపతి కోరినట్లు వెల్లడించిన రాహుల్
- ప్రధాని, హోంమంత్రి, సీఈసీ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారని ఆరోపణ
- సీఈసీ రాజీనామా చేయాలని, బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరపాలని డిమాండ్
- సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించిన విపక్ష కూటమి





## నీట్ విధానంలో మరిన్ని సంస్కరణలు

- నీట్ పరీక్ష నిర్వహణలో కీలక మార్పులు చేయాలి
- పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలి
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కీలక సిఫార్సులు చేసింది.
- ఇక్కడ ఎన్టీఏ పార్లమెంటుకు (లోక్‌సభ, రాజ్యసభ) జవాబుదారీగా ఉండేలా చట్టపరమైన వ్యవస్థ

## వెలిగొండ పూర్తి ఫలాలు అందించేందుకు అడుగులు

- రూ.2,847 కోట్లు ఇస్తే రెండు దశల్లోనూ నీళ్లు
- రూ.941 కోట్లతో తొలిదశ ఆయకట్టుకు నీరు
- తదుపరి పనులపై దృష్టి సారిస్తోంది.
- రూ.14,432 కోట్లకు అంచనాల సవరణ.
- జలజీవన్ మిషన్ పథకం కింద చేపట్టిన తాగునీటి సరఫరా ప్రాజెక్టును వేసవి కాలం నాటికి పూర్తి చేయాలనే సంకల్పంతో అడుగులు



**అమరావతి**

వెలిగొండ ప్రాజెక్టులో రెండు టన్నెళ్లు పూర్తి చేసి, నల్లమలసాగర్ జలాశయంలో దాదాపు 7 టీఎంసీల నీళ్లు ప్రభుత్వం నింపింది. ఇప్పుడు తదుపరి పనులపైనా దృష్టి సారిస్తోంది. వీటిని పూర్తి చేసేందుకు మరో రూ.2,847 కోట్లు అవసరమని ప్రాథమికంగా లెక్కలు వివరాలు 2లో..

## జెన్ జీకి భయపడుతున్న కేంద్రం

- అందుకే దిల్లీని కోటలా'- నిరసనల వేళ సీజేపీ విమర్శలు
- రాజధానిలో ఇంటర్నెట్ బంద్!
- సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ అక్టోబర్ 10న దిల్లీ జంతర్ మంతర్ వద్ద సీజేపీ భారీ నిరసనలకు సిద్ధమైంది. తమకు భయపడి కేంద్రం ఆంక్షలు విధిస్తోందని ఆరోపించింది.
- మెట్రో, రైళ్లపై ఆంక్షలు- సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు






## ఏ రంగంలోనూ గుత్తాధిపత్యాన్ని భారత్ అనుమతించదు

- ఫ్రీ మార్కెట్‌లో వినియోగదారులు తమకు నచ్చిన సేవలను ఎంచుకుంటారు
- వారికి పలు ఆప్షన్లను అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ బాధ్యత
- కేంద్ర కమ్యూనికేషన్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా



## నోబెల్ శాంతి బహుమతి రాకపోవడంతో.. ట్రంప్ అసహనం

- నోబెల్ శాంతి పురస్కారం దక్కకపోవడంపై ట్రంప్ అసంతృప్తి
- విజేత నవీ పిళ్లైను విమర్శిస్తూ చేసిన పోస్టును రీషేర్

## జనసేన ఎమ్మెల్యే బాలరాజుపై పవన్ కల్యాణ్ సీరియస్



- పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై విచారణకు కమిటీ
- జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు జారీ
- బాలరాజు వ్యవహారశైలిపై తీవ్ర అసంతృప్తితో ఉన్న పవన్
- గతంలో హెచ్చరించినా తీరు మారకపోవడంతో ఆగ్రహం
- కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని ప్రకటన

**అమరావతి**

జనసేన పార్టీకి చెందిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై వస్తున్న ఆరోపణల వ్యవహారంపై డిప్యూటీ సీఎం, పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. బాలరాజుపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపేందుకు పవన్ కల్యాణ్ ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమిస్తున్నట్లు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ నిర్ణయం పార్టీలో అంతర్గతంగా కలకలం రేపుతోంది. గత కొంతకాలంగా ఎమ్మెల్యే బాలరాజు వ్యవహారశైలి, పనితీరుపై పవన్ కల్యాణ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల మీడియాలో ఆయనపై ఆరోపణలు వివరాలు 2లో..

# స్థానిక సమరానికి గ్రీన్ సిగ్నల్

- వైఎస్సార్సీపీకి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ
- స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్
- హైకోర్టు ఇచ్చిన 6 వారాల గడువులోపు నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధమని రాష్ట్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు తెలిపింది.
- సర్ ప్రక్రియ పూర్తికాకుంటే పాత జాబితా ప్రకారమే ఎన్నికలు నిర్వహించుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం
- వార్డుల పునర్విభజన అడ్డుకోవడం, ఎన్నికలకు ఆటంకం కలిగించడమంటే ప్రజా ప్రయోజనాలను అడ్డుకోవడమేనని ధర్మాసనం వ్యాఖ్య



**అమరావతి**

వైఎస్సార్సీపీకి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. "సర్" ప్రక్రియ పూర్తయిన తర్వాతే స్థానిక ఎన్నికలు జరపాలంటూ వైఎస్సార్సీపీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఆ పార్టీ లేవనెత్తిన ఏ విషయాన్నీ అత్యున్నత న్యాయ స్థానం పరిగణనలోకి తీసుకోలేదు. హైకోర్టు ఇచ్చిన సమయం ప్రకారం 6 వారాల గడువులోపు నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధమని రాష్ట్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు తెలిపింది. అయితే నోటిఫికేషన్ విడుదలలోపు సర్ ప్రక్రియ పూర్తైతే ఆ జాబితానే ప్రామాణికంగా తీసుకోవాలని సుప్రీంకోర్టు ఎస్ఈసీకి వివరాలు 2లో..

## వ్యాపారానికి కాదు, గుత్తాధిపత్యానికే మేము వ్యతిరేకం

- మోదీ సర్కార్‌పై రాహుల్, ఖర్గే తీవ్ర విమర్శలు
- ప్రతి వ్యాపార సంస్థకు సమాన అవకాశాలు ఉండాలి
- రాజకీయ మద్దతుతో సాగే పెట్టుబడిదారీ విధానానికి చరమగీతం పాడాలి



# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

-మొదటిపేజీ తరువాయి

ఆందోళన చెందకూడదన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల విషయంలో జరిగిన అవకతవకలను సరిదిద్ది, రైతులకు పూర్తి భద్రత కల్పిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "మీ భూమి మీదే, హక్కు మీదే, ఆ హక్కును కాపాడే బాధ్యత మాది. అందుకే పాత పాస్‌బుక్‌లపై నాయకుల బొమ్మలు తొలగించి, ప్రభుత్వ రాజముద్రతో గ్యారెంటీ ఇస్తున్నాం" అని అన్నారు. వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశామని, రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టిన 22ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 16.48 లక్షల ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించామని, ప్రకాశం జిల్లాలోనే 3,304 ఎకరాల భూ సమస్యలను పరిష్కరించి 7,980 కుటుంబాల ఆశలను నిజం చేశామని తెలిపారు. గర్భకండ్రిగ వంటి ఏళ్లనాటి భూములకు సైతం విముక్తి కల్పించామన్నారు. భూ రికార్డులన్నీ డిజిటలైజ్ చేసి, బ్లాక్‌చైన్ టెక్నాలజీతో భద్రపరిచామని, రైతులు తమ ఇంటి నుంచే తమ భూమి వివరాలను ఫోన్‌లో చూసుకోవచ్చని చెప్పారు. ప్రతి నెలా 9వ తేదీన ఈ కార్యక్రమ పురోగతిని తానే స్వయంగా సమీక్షిస్తానని, అవినీతికి ఆస్కారం లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు.



### ప్రాజెక్టులకు శంకుస్థాపన.. అభివృద్ధికి బాటలు

ఈ పర్యటనలో భాగంగా, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పోతుల చెంచయ్య పాలేరు రిజర్వాయర్ నిర్మాణానికి, పాలేరు నదిపై హైలెవల్ వంతెన నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 9,500 ఎకరాలకు సాగునీరు, 15 గ్రామాల్లోని 30,000 మందికి తాగునీరు అందుతుందని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1ను నీళ్లు విడుదల చేశాకే జాతికి అంకితం చేశామని, ఫేజ్-2ను కూడా పూర్తి చేసి ఏటా నీళ్లిచ్చే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాబోయే మూడేళ్లలో రూ.36 వేల కోట్లతో 35 ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. రామాయపట్నం పోర్టును వేగంగా పూర్తి చేస్తున్నామని, బీపీసీఎల్ రూ.50 వేల కోట్ల పెట్టుబడితో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయని అన్నారు. దోనకొండను కీలక పారిశ్రామిక టౌన్‌షిప్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించారు.

### వేదికపైనే 'పబ్లిక్ ఆడిట్'.. అధికారులకు చురకలు

ఈ సభలో అందరి దృష్టినీ ఆకర్షించిన ప్రధాన ఘట్టం.. చంద్రబాబు వేదికపైనే నిర్వహించిన 'పబ్లిక్ ఆడిట్'. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను వేదికపైకి పిలిచి, ప్రజా స్పందన ఆధారంగా రూపొందించిన పనితీరు గణాంకాలను (పెర్ఫార్మెన్స్ డేటా) చదివి వినిపించారు. రాష్ట్ర సగటుతో పోలిస్తే ప్రకాశం జిల్లా, కొండేపి నియోజకవర్గం ఏయే అంశాల్లో వెనుకబడి ఉందో అంకెలతో సహా వివరించారు.

ముఖ్యంగా తాగునీటి సరఫరా (-7.93%), రవాణా శాఖ పన్నులు (-7.32%), రీ-సర్వే (-7.53%), అంగన్‌వాడీ సేవలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంటి అంశాల్లో ప్రతికూల పనితీరుపై అధికారులను నేరుగా ప్రశ్నించారు. "మీరు సరిగా పనిచేయకపోతే ప్రజలు నన్ను నిందిస్తారు. మీవల్ల నేను మాట పడాలా? పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవు" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. అదే సమయంలో గృహ నిర్మాణం (హౌసింగ్), ఇసుక సరఫరా, మత్స్యకార భరోసా వంటి అంశాల్లో మెరుగైన పనితీరు కనబరిచిన అధికారులను అభినందించారు.

### నాలుక చెప్పిందని కాకుండా, మంచి ఆహారం తీసుకోవాలి

రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చంద్రబాబు తెలిపారు. ఆరోగ్యమే అసలైన సంపద అని, తాను రోజూ మూడు కోడిగుడ్లలోని తెల్లసొనతో చేసిన ఆమ్లెట్ తింటానని, అదే తన ఆరోగ్య రహస్యమని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ వంటగదినే ఔషధశాలగా మార్చుకోవాలని, నాలుక చెప్పిందని కాకుండా శరీరానికి ఏది మంచిదో అదే తినాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేసి, సరైన సమయంలో మందులు వేసుకునేలా గుర్తుచేసే వ్యవస్థను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

### సంక్షేమం, రాజకీయ అంశాలపై వ్యాఖ్యలు

ఎన్డీఏ ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కార్ వేగంతో పనిచేస్తోందని, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి త్రిబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రాన్ని మరింత వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలైన పెన్షన్ల పెంపు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏటా మూడు ఉచిత సిలిండర్లు, అన్నదాత సుఖీభవ వంటివి విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావిస్తూ, తాము 34 శాతానికి పెంచితే, ప్రత్యర్థులు కోర్టులకు వెళ్లి అడ్డుకున్నారని ఆరోపించారు. కోర్టు తీర్పు ఎలా ఉన్నా, పార్టీపరంగా 34 శాతం కంటే ఎక్కువ సీట్లు బీసీలకు ఇచ్చి వారి రాజకీయ ఎదుగుదలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

### నేను నీతిమంతుడిగా ఉంటే సరిపోదు

నీతివంతమైన రాజకీయాలు చేయడమే తన లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. "నేను నీతివంతుడిగా ఉంటే సరిపోదు, నా కింద పనిచేసే అధికార యంత్రాంగం, రాజకీయ నాయకులు కూడా అవినీతికి దూరంగా ఉండాలి. చిత్రగుప్తుడిలా అందరి ఖాతాలను రాసుకుంటున్నాను. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎవరినైనా ఉపేక్షించేది లేదు. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగితే ఎవరికీ తెలియదనుకోవడం భ్రమ. నేను 360 డిగ్రీల కోణంలో అందరినీ గమనిస్తున్నాను" అని హెచ్చరించారు. ప్రజాసేవకుడిగా ప్రజల బాగోగులే తనకు ముఖ్యమని, దేశభక్తిని, రాష్ట్రంపై అభిమానాన్ని పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించాలని కోరారు. అంతిమంగా, ఆర్థిక అసమానతలు లేని సమాజాన్ని నిర్మించడమే తన ఆశయమని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# సీట్ల సర్దుబాటు ఎలా

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగనున్న వేళ, అధికార ఎన్డీయే కూటమిలో సీట్ల సర్దుబాటు అత్యంత సంక్లిష్టమైన ఘట్టంగా మారింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉండవల్లిలో సమావేశమై పొత్తులు, మేయర్, జెడ్పీటీసీ, చైర్‌పర్సన్ స్థానాల విభజనపై సుదీర్ఘంగా చర్చించారు. అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో అగ్రనేతలు ఇద్దరూ కలిసి ఒక నిర్ణయం తీసుకుంటే నియోజకవర్గ స్థాయి వరకు కేడర్ క్రమశిక్షణతో పనిచేసింది. కానీ, గ్రామీణ, పట్టణ స్థాయి పోలింగ్ బూత్‌ల వద్ద ముఖాముఖి తలపడే స్థానిక పోరులో కేవలం బాబు-పవన్‌ల భేటీలు, పిలుపులు కింది స్థాయి శ్రేణులను పూర్తిగా ఒకే తాటిపైకి తేగలవా అనేది ఇప్పుడు ఏపీ రాజకీయంలో అసలైన ప్రశ్న.శాసనసభ ఎన్నికల్లో 21 స్థానాల్లో పోటీ చేసి 100% స్ట్రైక్ రేట్ సాధించిన తర్వాత జనసేన కేడర్ ఆత్మవిశ్వాసం, ఆకాంక్షలు ఆకాశాన్ని తాకాయి. సార్వత్రిక ఎన్నికల సమయాన రాష్ట్ర ప్రయోజనాల కోసం 21 సీట్లకే పరిమితమయ్యామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం తమ ఆత్మగౌరవానికి భంగం కలగనివ్వబోమని పవన్ కళ్యాణ్ తో పాటు జనసేన ముఖ్య నేతలు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్డు సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో జనసేన గ్రాఫ్ బలంగా ఉందని, అసెంబ్లీ ఎన్నికల నాటి ఫార్ములా ఇక్కడ వర్తించదని కేడర్ ఇప్పటికే తెగేసి చెబుతోంది. 30 శాతానికి పైగా స్థానాలు దక్కించుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో సొంత నాయకత్వాన్ని బలపరుచుకోవాలని జనసేన పట్టుబడుతోంది. అటు తెలుగుదేశం పార్టీకి గ్రామీణ ఏపీలో ఐదు దశాబ్దాల బలమైన ఓటు బ్యాంకు, బూత్ స్థాయి బలగాలు ఉన్నాయి. గత ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ వేధింపులు ఎదుర్కొని, స్థానికంగా పార్టీ జెండాను నిలబెట్టిన టీడీపీ గ్రామ స్థాయి నేతలు ఈసారి ఎలాగైనా పదవులు చేజిక్కించుకోవాలని ఆరాటపడుతున్నారు. చంద్రబాబు ఎన్ని సర్దుబాట్లు చెప్పినా.. తమకు దక్కాల్సిన సర్పంచ్, ఎంపీటీసీ లేదా కౌన్సిలర్ సీటును జనసేనకో, బీజేపీకో కేటాయిస్తే ఊరుకునే పరిస్థితి క్షేత్రస్థాయి టీడీపీ నేతల్లో లేదు. ఒకవేళ పార్టీ నుంచి అధికారికంగా బి-ఫామ్ రాకపోయినా 'రెబెల్స్'గా అభ్యర్థులను దింపడానికో లేదా స్వతంత్రంగా పోటీ చేయడానికో స్థానిక టీడీపీ శ్రేణులు వెనుకాడేలా లేవు. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఈ కూటమిలోని అసమ్మతిని అనుకూలంగా మార్చుకోవడానికి వేచి చూస్తోంది. నియోజకవర్గ స్థాయిలో చంద్రబాబు, పవన్ ఎంత మైత్రిని ప్రదర్శించినా, పంచాయతీ, వార్డు స్థాయిలో కుటుంబాలు, పాత కక్షలు, వ్యక్తిగత ప్రాబల్యాలే గెలుపోటములను శాసిస్తాయి. కూటమిలో సీటు దక్కని టీడీపీ లేదా జనసేన అసంతృప్త నేతలు తిరుగుబాటు అభ్యర్థులుగా పోటీ చేస్తే ఓట్లు చీలిపోవడం ఖాయం. ఆ చీలిక ద్వారా తాము పుంజుకోవచ్చని వైఎస్సార్‌సీపీ ఆశిస్తోంది. ఈ రకమైన సాంప్రదాయ స్థానిక వైరుధ్యాలను అగ్రనేతలు పైస్థాయి నుంచి నియంత్రించడం దాదాపు అసాధ్యమనే చెప్పాలి. ఈ క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొనేందుకు చంద్రబాబు బలం ఉన్న చోట మిత్రపక్షానికే ప్రాధాన్యం అనే ఫార్ములాను ప్రతిపాదించారు. అయితే, ఒక నిర్దిష్ట పంచాయతీలో లేదా వార్డులో టీడీపీకి ఎక్కువ బలముందా, లేక జనసేనకు ఉందా అని తేల్చడం కత్తిమీద సాము లాంటిది. పార్టీ కమిటీల నిర్వహణ, ఉమ్మడి సర్వేలు, నామినేటెడ్ పదవుల హామీలతో అసంతృప్తిని చల్లార్చాలని బాబు-పవన్ ప్రయత్నిస్తున్నప్పటికీ, అధికారం తలుపు తడుతున్న వేళ పదవుల కోసం ద్వితీయ శ్రేణి నేతల మధ్య పోటీ రాపిడికి దారితీస్తోంది. రాష్ట్రస్థాయిలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల ఐక్యత ఎంత పటిష్టంగా ఉన్నప్పటికీ, స్థానిక ఎన్నికలు అనేది పూర్తిగా కింది స్థాయి నాయకుల ఉనికి, భవిష్యత్తుకు సంబంధించిన అంశం. పంచాయతీ, మున్సిపాలిటీ స్థాయిలో చోటుచేసుకునే ఫ్రెండ్లీ ఫైట్లు లేదా తిరుగుబాట్లు ప్రధాన కూటమి ఐక్యతను దెబ్బతీయకుండా, కేడర్‌ను సమన్వయం చేయడమే అమరావతి పెద్దలకు రాబోయే రోజుల్లో అతిపెద్ద సవాలు కానుంది.



## ఏపీలో కొత్త పార్టీకి స్పేస్ ఉందా

**విజయవాడ :** ఏపీ రాజకీయం ఎప్పుడూ వేడిమీదే ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో ఏపీ పొలిటికల్ స్క్రీన్‌పై సరికొత్త ట్రెండ్ కనిపిస్తోంది. జడ శ్రవణ్ కుమార్, రిటైర్డ్ ఐఏఎస్ విజయకుమార్, బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్, మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, మాజీ సీబీఐ జాయింట్ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు, కేకే సర్వేస్ కొండేటి కిరణ్.. చివరికి వైఎస్సార్‌సీపీ నుంచి దూరమైన రాజ్యసభ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వరకు కొత్త రాజకీయ వేదికలు, పార్టీలు లేదా స్వతంత్ర రాజకీయం వైపు ప్రయాణిస్తుండటం చర్చనీయాంశమవుతోంది. అసలు ఏపీలో రాజకీయం అంటే అంత సింపుల్ అయిపోయిందా? ప్రెస్ మీట్లు పెట్టడం, జెండా ఎగరేయడం, కొత్త పార్టీ అని ప్రకటించేయడం ఇంత సులువైన వ్యవహారమా? అనే ప్రశ్నలు సామాన్య ప్రజల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. కొత్త పార్టీల స్థాపన వెనుక ప్రధానంగా మూడే మూడు అంశాలు కనిపిస్తున్నాయి. మొదటిది రిటైర్మెంట్ పొలిటికల్ అంబిషన్ , రెండోది సామాజిక వర్గాల ఆత్మగౌరవ పోరాటాలు , మూడోది ప్రధాన పార్టీల్లో అవకాశాలు దక్కక సొంత దుకాణం తెరవడం! కానీ, క్షేత్రస్థాయిలో ఒక రాజకీయ పార్టీని స్థాపించి, దానిని జిల్లాల వారీగా, మండలాల వారీగా కేడర్‌తో నిర్మించడం, భారీ ఎత్తున ఎన్నికల వ్యయాన్ని తట్టుకోవడం ఎంత సంక్లిష్టమైన విషయమో ఈ కొత్త నేతలు గుర్తించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. కేవలం టివి డిబేట్లు, సోషల్ మీడియా క్లిప్పింగులతో ఎన్నికల్లో నెగ్గుకురావచ్చనే భ్రమలోనే ఈ కొత్త పార్టీల హడావుడి సాగుతోంది.ఇక అసలైన ప్రశ్నకు వస్తే.. ఈ కొత్త రాజకీయ వేదికల్లో ఒక్కటైనా ప్రధాన పార్టీలైన తెలుగుదేశం , వైఎస్సార్‌సీపీ లేదా కూటమిలో భాగమైన జనసేన ఓటు బ్యాంకును చీల్చగలదా? దీనికి సమాధానం ఖచ్చితంగా లేదు అనే వస్తోంది. ఆంధ్రప్రదేశ్ ముఖాముఖి రాజకీయాలకు అలవాటుపడిన రాష్ట్రం. ఇక్కడ ఓటరు చాలా స్పష్టంగా అధికార-ప్రతిపక్షాల మధ్యే తన తీర్పును విభజిస్తాడు.

## స్థానిక సమరానికి గ్రీన్ సిగ్నల్

-మొదటిపేజీ తరువాయి

సూచించింది. సర్ ప్రక్రియ పూర్తికాకుంటే పాత జాబితా ప్రకారమే ఎన్నికలు నిర్వహించుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ విషయంలో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సమర్థించింది. వార్డుల పునర్విభజన అడ్డుకోవడం, ఎన్నికలకు ఆటంకం కలిగించడమంటే ప్రజా ప్రయోజనాలను అడ్డుకోవడమేనని ధర్మాసనం వ్యాఖ్యానించింది. . ఇబ్బంది పడేవారికి లేని బాధ మీకెందుకని వైఎస్సార్సీపీ లాయర్?ను కోర్టు నిలదీసింది. ఎన్యూమరేటర్లు, ప్రభుత్వం, కేంద్రం ఎవరికీ లేని నొప్పి మీకెందుకని ప్రశ్నించింది. బీసీ రిజర్వేషన్ల కేసు కొట్టివేత: స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అంశంపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. 34 శాతం కోటాతో మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని దాటుతున్నాయంటూ ఏపీ ప్రభుత్వం జారీ చేసిన రెండు జీవోలను హైకోర్టు ఇటీవల కొట్టివేసిన సంగతి తెలిసిందే. దీంతో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం నిరాకరించింది. డెడికేటెడ్ కమిషన్ నివేదిక అమలు చేస్తున్నామని ప్రభుత్వ న్యాయవాది చెప్పగా, ఎక్కడ ఉందని జస్టిస్ దీపాంకర్‌దత్త ధర్మాసనం ప్రశ్నించింది. నివేదిక ఆధారంగా ఫ్యామిలీ డేటాను పరిగణనలోకి తీసుకుంటారని ధర్మాసనం వ్యాఖ్యానించగా, నివేదిక ఇంకా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని ప్రభుత్వ న్యాయవాది ముకుల్ రోహత్గీ వివరించారు. ఫ్యామిలీ డేటాను డెడికేటెడ్ కమిషన్ నుంచి తీసుకున్నట్లు తెలిపారు. నివేదిక ఆమోదం లేకుండా డేటా తీసుకోవడంలో హైకోర్టు కారణం సరిగానే ఉందన్న సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

## జనసేన ఎమ్మెల్యే బాలరాజుపై పవన్ కల్యాణ్ సీరియస్..

-మొదటిపేజీ తరువాయి

రావడంతో ఈ వ్యవహారాన్ని అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. గతంలోనే బాలరాజును పార్టీ కార్యాలయానికి పిలిపించి, గిరిజన ప్రజలకు పారదర్శకమైన, నీతివంతమైన పాలన అందించాలని, వారి సేవకే అంకితం కావాలని పవన్ కల్యాణ్ వ్యక్తిగతంగా సూచించారు. అయినప్పటికీ ఆయన ప్రవర్తనలో మార్పు రాకపోవడంపై పవన్ తీవ్ర అసహనం, విసుగుతో ఉన్నట్లు పార్టీ ప్రకటనలో పేర్కొన్నారు. ఓవైపు 'అడవితల్లి బాట' వంటి కార్యక్రమాల ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పార్టీ కృషి చేస్తుంటే, అదే గిరిజన ప్రాంతం నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధి వ్యవహారశైలిపై వస్తున్న ఆరోపణలు పార్టీకి ఇబ్బందికరంగా మారాయి. ఈ నేపథ్యంలోనే పవన్ కల్యాణ్ ఈ విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, వాస్తవాలను నిగ్గు తేల్చి, పార్టీ అధ్యక్షుడికి నివేదిక సమర్పించనుంది. ఆ నివేదిక ఆధారంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై తదుపరి చర్యలు ఉంటాయని జనసేన పార్టీ స్పష్టం చేసింది. దీంతో బాలరాజు రాజకీయ భవిష్యత్తుపై ఉత్కంఠ నెలకొంది.

## వెలిగొండ పూర్తి ఫలాలు అందించేందుకు అడుగులు

-మొదటిపేజీ తరువాయి

వేసినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా రూ.9,081.30 కోట్లకు ఉన్న అంచనా వ్యయాన్ని తాజా పరిస్థితులకు అనుగుణంగా సవరించాల్సి ఉంది. ప్రాజెక్టు మొత్తం వ్యయాన్ని రూ.14,432 కోట్లకు సవరించేలా ప్రతిపాదనలతో వెలిగొండ ప్రాజెక్టు అధికారులు చీఫ్ ఇంజినీర్ల కమిటీకి నివేదిక సమర్పించారు. కమిటీ పరిశీలన అనంతరం ప్రతిపాదన ప్రభుత్వానికి పంపిస్తారు. రెండో దశలో ఉమ్మడి ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల పరిధిలోని 3,28,300 ఎకరాల ఆయకట్టుకు నీళ్లిచ్చేలా పనులు పూర్తి చేయాల్సి ఉంది.

### రూ.941 కోట్లతో తొలిదశ ఆయకట్టుకు నీరు

వెలిగొండ నుంచి నల్లమలసాగర్ జలాశయానికి ఇప్పటికే కొంతమేర నీరు తరలించారు. జలజీవన్ మిషన్ పథకం? కింద చేపట్టిన తాగునీటి సరఫరా ప్రాజెక్టును వేసవి కాలం నాటికి పూర్తి చేయాలనే సంకల్పంతో అడుగులు వేస్తున్నారు.

తొలిదశలో 1,19,000 ఎకరాల ఆయకట్టుకు నీరు ఇచ్చేందుకు డిస్ట్రిబ్యూటరీలు, పిల్ల కాలువలు, మైనర్లు, ఫీల్డ్ ఛానళ్లు ఏర్పాటు చేయాలి. నల్లమలసాగర్ నుంచి తీగలేరు కాలువ, గొట్టిపడియ, తూర్పు ప్రధాన కాలువ నీళ్లు తీసుకెళతాయి. ఇందులో తీగలేరు కాలువ 48.30 కిలోమీటర్లకు గాను ఇంకో అర కిలో మీటర్ మేర తవ్వాల్సి ఉంది. కాలువపై 72 కట్టడాలకు 40 నిర్మాణాలు పూర్తయ్యాయి. 62,000 ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చే ఈ కాలువ నిర్మాణం, డిస్ట్రిబ్యూటరీల ఏర్పాటుకు 424.53 ఎకరాలు సేకరించాల్సి ఉంది. గొట్టిపడియ కాలువ నిర్మాణం 11.40 కిలో మీటర్ల మేర పూర్తయింది. కేవలం చిన్న చిన్న పనులు మాత్రమే పెండింగులో ఉన్నాయి. తొలిదశలో తూర్పు ప్రధాన కాలువ 44.625 కిలోమీటర్ల దూరం వరకు పరిగణనలోకి వస్తుంది. ఇందులో 44.025 కిలో మీటర్ల మేర తవ్వకం పూర్తయింది. 48 కట్టడాల్లో ఇంకా 30 నిర్మించాల్సి ఉంది. అలాగే 952.18 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. రెండవ దశకు రూ. 1,906 కోట్లు: వెలిగొండ రెండవ దశ ప్రాజెక్టులో భాగంగా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల పరిధిలోని 3,28,300 ఎకరాలకు నీరందించేందుకు పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఇందులో నల్లమలసాగర్ జలాశయం నుంచి ప్రారంభమయ్యే తూర్పు ప్రధాన కాలువ కిందే 2.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. 86 కిలోమీటర్ల మేర పొడవున్న ఈ కాలువలో కేవలం 3 కిలోమీటర్ల మేర తవ్వకం మాత్రమే మిగిలి ఉంది. బ్రాంచి కాలువల విషయానికొస్తే, మొత్తం 244 కిలోమీటర్లలో 31 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేయాల్సి ఉంది. అదనంగా ప్రధాన కాలువపై 75 నిర్మాణాలు, బ్రాంచి కాలువలపై 634 కట్టడాల పనులు చేపట్టాల్సి ఉంది. 60,300 ఎకరాలకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో నిర్మిస్తున్న పశ్చిమ బ్రాంచి కాలువలో 30 కట్టడాలు పూర్తి కావాల్సి ఉంది.

## 34 శాతం బీసీ వర్గాలకు సాధ్యమేనా

**రాజమండ్రి :** ఏపీ రాజకీయం మళ్లీ పాత పద్దతిలోకే వెళ్లింది. సుప్రీంకోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్ పరిమితి , క్రిష్ణమూర్తి కేసు తీర్పు ఆధారంగా రూపొందించిన ట్రిపుల్ టెస్ట్ విధానాన్ని అధిగమించడం అంత తేలిక కాదు అని తెలిసినప్పటికీ, ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా 34% లేదా అంతకంటే ఎక్కువ రిజర్వేషన్ల ప్రతిపాదనతో జీవోలు తీసుకువచ్చింది. చట్టపరంగా నిలబడదని అందరికీ తెలుసు. హైకోర్టులో ఇటువంటి నిర్ణయాలు సమీక్షకు వచ్చినప్పుడు 50 శాతం పరిమితి దాటకూడదని స్పష్టం కావడం దీనికి ప్రధాన నిదర్శనం. దీనివల్ల రిజర్వేషన్ల అంశం న్యాయస్థానాల్లో చిక్కుకోవడం, చివరికి పాత పద్ధతిలోనే ఎన్నికలు జరగడం లేదా ఆలస్యం కావడం పరిపాటిగా మారింది. అయితే, సాధ్యం కాదని తెలిసినా రాజకీయ పార్టీలు ఈ తప్పును పదే పదే ఎందుకు చేస్తాయి? అనేదే అసలు ప్రశ్న. దీని వెనుక ప్రధాన కారణం రాజకీయ క్రెడిట్ దక్కించుకోవడం , నెపం ప్రత్యర్థులపైకి నెట్టేయడం . 50 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభా సింహభాగాన్ని ఆకట్టుకోవడానికి ప్రతీ అధికార పార్టీ తాము బీసీలకు గరిష్ట స్థాయిలో స్థానిక పదవులు ఇస్తున్నామనే భావనను కల్పించడానికి ప్రయత్నిస్తుంది. ఆ తర్వాత కోర్టులు ఆ నిర్ణయాన్ని కొట్టివేస్తే, మేము ఇవ్వడానికి సిద్ధపడ్డాము కానీ కో ప్రత్యర్థి పార్టీలు వేసిన పిటిషన్ల వల్ల రద్దయ్యాయి అంటూ తమ తప్పును దాచుకునేందుకు , ప్రత్యర్థులను బీసీ వ్యతిరేకులు గా చిత్రీకరించేందుకు ఈ డ్రామా ఉపయోగపడుతుంది. గతంలో వైసీపీ ప్రభుత్వం హయాంలోనూ సరిగ్గా ఇదే తరహా పరిణామాలు చోటుచేసుకున్నాయి. 34% రిజర్వేషన్ జీవోలు తేవడం, అది కోర్టుల్లో రద్దు కావడం, ఆపై 24% కు తగ్గించి ఎన్నికలు నిర్వహించారు. ఇప్పుడు టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కూడా అదే తరహా నిర్ణయాలతో ముందుకు వెళ్తోంది. ఇక తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విషయంలోనూ కుల గణన, బీసీ రిజర్వేషన్ల పెంపు హామీల చుట్టూ ఇవే న్యాయపరమైన సవాళ్లు దాగి ఉన్నాయి. చట్టపరమైన వెసులుబాటు , సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసన తీర్పుల పరిమితిపై స్పష్టత ఉన్నప్పటికీ ఏ పార్టీ కూడా నిజం చెప్పే సాహసం చేయడం లేదు. ఒకవేళ పొలిటికల్ పార్టీలకు బీసీలకు న్యాయం చేయాలనే నిజమైన కట్టుబడి ఉంటే, చట్టపరమైన రిజర్వేషన్ల శాతం కోసం కోర్టులను ఆశ్రయించి కాలయాపన చేయడం కంటే పార్టీ బి-ఫామ్‌ల కేటాయింపులో తమ నిజాయితీని నిరూపించుకోవచ్చు. మునిసిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు లేదా కార్పొరేషన్ ఎన్నికల్లో చట్టబద్ధంగా వచ్చే రిజర్వేషన్ శాతానికి అదనంగా, పార్టీల తరఫున జనరల్ స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులకే టికెట్లు ఇచ్చి గెలిపించే వెసులుబాటు రాజకీయ పార్టీలకు ఉంది. కానీ ఏ పార్టీ కూడా జనరల్ స్థానాలను బీసీలకు ఇచ్చేందుకు సిద్ధపడదు.

# రావులచెరువులో ఇంటి వద్దకే 42 రకాల ఉచిత ఆరోగ్య పరీక్షలు



**అవసరమైన మందుల పంపిణీ...డాక్టర్ దిలీప్ కుమార్**

**ధర్మవరం,రూరల్ అక్టోబర్ 09 (పెన్ సత్తా)** ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా మండల పరిధిలోని రావులచెరువు గ్రామంలో 104 మొబైల్ మెడికల్ యూనిట్ ద్వారా 42 రకాల ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహించినట్లు డాక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

భవ్య హెల్త్ సర్వీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 104 మొబైల్ మెడికల్ యూనిట్ ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఇంటి వద్దకే వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు.

గతంలో రక్తపోటు, మధుమేహం,మూత్ర పరీక్షలు మాత్రమే నిర్వహించేవారని ల్యాబ్ టెక్నీషియన్ గంగాభవాని తెలిపారు. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవతో ఆధునిక వైద్య పరీక్షలు నిర్వహించేందుకు రెండు ప్రత్యేక యంత్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఆరోగ్య పరీక్షలతో పాటు అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తున్నామని, తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సంజీవిని ఆసుపత్రి ద్వారా చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పరీక్షల నివేదికలను వాట్సాప్ ద్వారా పంపిస్తామని, స్మార్ట్‌ఫోన్‌లు లేని వారికి ముద్రిత నివేదికలను అందజేస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ గంగాభవాని, ఏఎన్ఎం శివలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ పరిమళ,ఆశా కార్యకర్తలు సావిత్రమ్మ,సరస్వతి, నాగేంద్రమ్మ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి హాకీ పోటీలకు సత్యసాయి జిల్లాక్రీడాకారులు

**హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షులు సూర్యప్రకాష్**

**ధర్మవరం,అక్టోబర్ 09 (పెన్ సత్తా)**హాకీ ఇండియా ఆధ్వర్యంలో అక్టోబర్ 10వ తేదీ నుండి 21వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఝాన్సీ నగరం లో జరుగనున్న 16వ జాతీయస్థాయి సీనియర్ పురుషుల హాకీ పోటీలలో పాల్గొనబోయే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు సత్యసాయి జిల్లా ధర్మవరం కు చెందిన క్రీడాకారులు ప్రశాంత్,నవీన్ కుమార్,మహమ్మద్ రఫీ,ఎంపికైనట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్

బి.సూర్యప్రకాష్ తెలియజేశారుఅలాగే ఈ జట్టుకు కోచ్ గా సత్యసాయి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ హాకీ కోచ్ హస్సేన్ వ్యవహరించనున్నట్లు అయన ఒక ప్రకటనలో తెలియజేసారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు ఈ టోర్నమెంట్ గ్రూప్ లీగ్ మ్యాచ్ లలో 10 వతేదీ గుజరాత్,12 వ తేది బీహార్,13 వ తేదీ రాజస్థాన్ రాష్ట్ర జట్లతో తలపడనుంది అని తెలిపారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులను హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్,సత్యసాయి జిల్లా జనరల్ సెక్రెటరీ బి.సూర్య ప్రకాష్,హాకీ సత్యసాయిజిల్లా అధ్యక్షులు బీ.వీ.శ్రీనివాసులు, గౌరవాధ్యక్షులు బండి వేణుగోపాల్,పల్లెం వేణుగోపాల్,వైస్ ప్రెసిడెంట్ గౌరీ ప్రసాద్, ఉడుముల రామచంద్ర,




మహమ్మద్ అస్లాం, ఊకా రాఘవేంద్ర,ట్రెజరర్ అంజన్న,జాయింట్ సెక్రటరీ అరవింద్ గౌడ్,చందు,మారుతీ కుమార్,డైరెక్టర్లు ఇర్షాద్ , అమునుద్దీన్,కిరణ్, ఫిజికల్ డైరెక్టర్లు ఓబిలేసు,రఘునాథ రావు హర్షం వ్యక్తం

# తల్లి, బిడ్డల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట



**పుట్టపర్తి, అక్టోబర్ 9, (పెన్ సత్తా)**:తల్లి, బిడ్డల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. మహిళా, శిశు సంక్షేమం కోసం అంగన్వాడీ కార్యకర్తలు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో అంగన్వాడీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని ఆమె కొనియాడారు. 9వ అంగన్వాడీ పోషణ మాసం--2026 మహోత్సవాల్లో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ పుట్టపర్తి ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు వేడుకలకు పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఐసీడీఎస్ పీడీ ప్రమీల హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం, గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణ, పిల్లల ఎదుగుదల, ప్రాథమిక విద్యపై అవగాహన కల్పించడంలో అంగన్వాడీ కార్యకర్తలు అంకితభావంతో పనిచేస్తున్నారని ప్రశంసించారు. సమాజంలో పోషకాహార లోపాన్ని నివారించడంతో పాటు ఆరోగ్యవంతమైన భవిష్యత్ తరాలను తీర్చిదిద్దడంలో అంగన్వాడీల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే, వాటిని అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మహిళా, శిశు సంక్షేమ రంగంలో పనిచేస్తున్న సిబ్బందికి అండగా ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అంగన్వాడీలకు గతంలో వేతనం 7500 ఉండేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంత దూర దృష్టితో నెలసరి వేతనం 11500 రూపాయలకు పెంచారని గుర్తు చేశారు. ఏ విధంగా చాలీచాలని వేతనాలతో నెట్టుకొస్తున్న

- అంగన్వాడీ కార్యకర్తల సేవలు మరువలేనివి
- అంగన్వాడీ వర్కర్ల సమస్యలను అసెంబ్లీ ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా
- పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి
- అంగన్వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించింది చంద్రబాబు నాయుడే
- మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి వెల్లడి

అంగన్వాడి వర్కర్లకు తల్లికి వందనం ఆమలయ్యే విధంగా కూటమి ప్రభుత్వం లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక చర్యలు తీసుకున్నారని అందుకు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడి వర్కర్లకు ఈ పథకం అమలు ఏ విధంగా రాష్ట్ర అసెంబ్లీ ద్వారా ప్రభుత్వం తీసుకెళ్లిన ఎమ్మెల్యే పల్లె సింధూరకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

**ఉత్తమ సేవలందించిన అంగన్వాడీ కార్యకర్తలకు సన్మానం..**

పోషణ మాసం సందర్భంగా వివిధ కార్యక్రమాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, అంకితభావంతో సేవలందించిన అంగన్వాడీ కార్యకర్తలను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సిబ్బందిని అభినందించి, భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఒలిపి శ్రీనివాసులు ,యశోద రాయుడు,కాళహస్తి ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ టిడిపి రాష్ట్ర కార్యదర్శి సామకోటి ఆదినారాయణ బిజెపి నాయకులు కళ్యాణ్ జనసేన నాయకులుశ్రీనివాసులు ,మహిళా, శిశు సంక్షేమ శాఖ సిడిపిఓ లు జయంతి గాయత్రి, ఇతరఅధికారులు అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దుకాణాల ముందు చెత్త వేస్తే చర్యలు.. రెండు దుకాణాలు సీజ్

**భీమిలి, అక్టోబర్ 9 ---  (పెన్ సత్తా)**పరిసరాల పరిశుభ్రతకు విఘాతం కలిగిస్తూ దుకాణాల ముందు చెత్త వేస్తున్న రెండు దుకాణాలపై జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. భీమునిపట్నం జోన్ పరిధిలోని భీమిలి, తగరపువలస ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన రెండు దుకాణాలను సీజ్ చేయడంతోపాటు, ఒక్కో దుకాణ యజమానికి రూ.25 వేల చొప్పున జరిమానా విధించారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు భీమునిపట్నం జోనల్ కమిషనర్ ఎం. విజయ్ కుమార్ పర్యవేక్షణలో ఈ చర్యలు చేపట్టారు. గత రెండు రోజుల్లో భీమిలి, తగరపువలస ప్రాంతాల్లో మొత్తం రూ.90 వేల జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. పరిసరాల్లో చెత్త వేయకుండా దుకాణ యజమానులు బాధ్యతగా వ్యవహరించాలని, పారిశుధ్య నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ బి. మహాలక్ష్మి నాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శివ, నగేష్, మలేరియా ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, మేస్త్రీలు రవి, హరీష్, దాసు, పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులు శ్రీనివాస్, వెంకటేష్, సురేష్, కృష్ణ, త్రివేణి, ప్రసాద్, మనోజ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# మహిళా పోలీసు అధికారిణి పట్ల అనుచిత ప్రవర్తనపై విచారణ జరపాలి

- రాహుల్ గాంధీపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి...బిజెపి మోర్చా మహిళలు



**ధర్మవరం,అక్టోబర్ 09 (పెన్ సత్తా)** మహిళా పోలీసు అధికారిణి పట్ల కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అనుచితంగా ప్రవర్తించినట్లు వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలు నిర్ధారించిన అనంతరం చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని బీజేపీ మోర్చా మహిళలు కోరారు. ఈ మేరకు గురువారం ధర్మవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా బీజేపీ మహిళలు మాట్లాడుతూ,ఈ నెల 8వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో మహిళా పోలీసు అధికారిణి పట్ల రాహుల్ గాంధీ అనుచితంగా ప్రవర్తించినట్లు వచ్చిన ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. మహిళల గౌరవం,ఆత్మగౌరవం, భద్రత విషయంలో ఎవరూ చట్టానికి అతీతులు కారని వారు పేర్కొన్నారు. మహిళల పట్ల గౌరవంగా వ్యవహరించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఉన్నప్పటికీ చట్టాన్ని, మహిళల గౌరవాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను నిర్ధారించి, చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ మోర్చా మహిళలు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బీరే విజయలక్ష్మి, మహిళా మోర్చా అధ్యక్షురాలు జగ్గా నాగరత్నమ్మ,జిల్లా కార్యవర్గ సభ్యురాలు పాలగిరి వరలక్ష్మి, పోరాళ్ల మహాలక్ష్మి, మంజుల బాయి, చంద్రిక తదితరులు పాల్గొన్నారు. ద

## రాష్ట్రస్థాయి ఊషు పోటీల్లో ధర్మవరం విద్యార్థుల సత్తా

- వర్షిణికి కాంస్య పతకం..చైత్రకు రజత పతకం
- కరాటే మాస్టర్ ఇనాయత్ భాషా




**ధర్మవరం,అక్టోబర్ 09 (పెన్ సత్తా)**రాష్ట్రస్థాయి ఊషు పోటీల్లో ధర్మవరం విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు సాధించారని కరాటే మాస్టర్ ఇనాయత్ భాషా తెలిపారు. నెల్లూరులోని అంబేద్కర్ భవన్‌లో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్-70 రాష్ట్రస్థాయి ఊషు పోటీల్లో ధర్మవరం విద్యార్థినులు పతకాలు సాధించి పట్టణానికి గుర్తింపు తీసుకొచ్చారని పేర్కొన్నారు.

ఈ పోటీల్లో ధర్మవరం జి.వి.ఇ జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న వి. వర్షిణి అండర్-19 విభాగంలో మైనస్ 42 కేజీల కేటగిరీలో పాల్గొని సెమీఫైనల్స్‌లో కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా ధర్మవరం ఏపీ మోడల్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న నిమ్మల చైత్ర అండర్-17 విభాగంలో మైనస్ 52 కేజీల కేటగిరీలో పోటీపడి రజత పతకం సాధించినట్లు వెల్లడించారు.

ఈ రాష్ట్రస్థాయి పోటీల్లో 13 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. అక్టోబర్ 10న జరగనున్న రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు కూడా విద్యార్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. పల్నాడు జిల్లా కారంపూడి మండలంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ధర్మవరం మల్టీ స్టార్ బుడోకాన్ కరాటే అకాడమీ విద్యార్థులు తమ ప్రతిభను చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

# ధర్మవరంలో మహిళ అదృశ్యం

**ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించండి...వన్ టౌన్ సిఐ రెడ్డప్ప**



**ధర్మవరం,అక్టోబర్ 09 (పెన్ సత్తా)**పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన సోంపల్లి కోటేశ్వరి (36) అదృశ్యమైనట్లు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అక్టోబర్ 2వ తేదీ సాయంత్రం 6 గంటల తర్వాత పట్టణంలోని పుట్టపర్తి రోడ్డులో ఉన్న ఎంబ్రాయిడరీ షాప్ నుంచి ఆమె వెళ్లిపోయినట్లు సమాచారం.

అప్పటి నుంచి ఇప్పటివరకు ఆమె ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, కోటేశ్వరి ఆచూకీ కోసం వివరాలు సేకరిస్తున్నారు. కోటేశ్వరి ఆచూకీ తెలిసిన వారు లేదా ఆమెను ఎక్కడైనా గుర్తించిన వారు వెంటనే కింది ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించాల్సిన ఫోన్ నంబర్లు:
9885287140
9440796831..

# సీట్ల సర్దుబాటు ఎలా

**విజయవాడ, అక్టోబరు 9,**
ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగనున్న వేళ, అధికార ఎన్డీయే కూటమిలో సీట్ల సర్దుబాటు అత్యంత సంక్లిష్టమైన ఘట్టంగా మారింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉండవల్లిలో సమావేశమై పొత్తులు, మేయర్, జెడ్పీటీసీ, చైర్‌పర్సన్ స్థానాల విభజనపై సుదీర్ఘంగా చర్చించారు. అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో అగ్రనేతలు ఇద్దరూ కలిసి ఒక నిర్ణయం తీసుకుంటే నియోజకవర్గ స్థాయి వరకు కేడర్ క్రమశిక్షణతో పనిచేసింది. కానీ, గ్రామీణ, పట్టణ స్థాయి పోలింగ్ బూత్‌ల వద్ద ముఖాముఖి తలపడే స్థానిక పోరులో కేవలం బాబు-పవన్‌ల భేటీలు,పిలుపులు కింది స్థాయి శ్రేణులను పూర్తిగా ఒకే తాటిపైకి తేగలవా అనేది ఇప్పుడు ఏపీ రాజకీయంలో అసలైన ప్రశ్న.శాసనసభ ఎన్నికల్లో 21 స్థానాల్లో పోటీ చేసి 100% స్ట్రైక్ రేట్ సాధించిన తర్వాతజనసేన కేడర్ ఆత్మవిశ్వాసం, ఆకాంక్షలు ఆకాశాన్ని తాకాయి. సార్వత్రిక ఎన్నికల సమయాన రాష్ట్ర ప్రయోజనాల కోసం 21 సీట్లకే పరిమితమయ్యామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం తమ ఆత్మగౌరవానికి భంగం కలగనివ్వబోమని పవన్ కళ్యాణ్ తో పాటు జనసేన ముఖ్య నేతలు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్డు సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లోజనసేన గ్రాఫ్ బలంగా ఉందని, అసెంబ్లీ ఎన్నికల నాటి ఫార్ములా ఇక్కడ వర్తించదని కేడర్ ఇప్పటికే తెగేసి చెబుతోంది. 30 శాతానికి పైగా స్థానాలు దక్కించుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో సొంత నాయకత్వాన్ని బలపరుచుకోవాలని జనసేన పట్టుబడుతోంది.అటు తెలుగుదేశం పార్టీకి గ్రామీణ ఏపీలో ఐదు దశాబ్దాల బలమైన ఓటు బ్యాంకు, బూత్ స్థాయి బలగాలు ఉన్నాయి. గత ఐదేళ్లుగావైఎస్సార్‌సీపీ వేధింపులు ఎదుర్కొని, స్థానికంగా పార్టీ జెండాను నిలబెట్టిన టీడీపీ గ్రామ స్థాయి నేతలు ఈసారి ఎలాగైనా పదవులు చేజిక్కించుకోవాలని ఆరాటపడుతున్నారు. చంద్రబాబు ఎన్ని సర్దుబాట్లు చెప్పినా.. తమకు దక్కాల్సిన సర్పంచ్, ఎంపీటీసీ లేదా కౌన్సిలర్ సీటును జనసేనకో, బీజేపీకో కేటాయిస్తే ఊరుకునే




పరిస్థితి క్షేత్రస్థాయి టీడీపీ నేతల్లో లేదు. ఒకవేళ పార్టీ నుంచి అధికారికంగా బి-ఫామ్‌రాకపోయినా 'రెబెల్స్'గా అభ్యర్థులను దింపడానికో లేదా స్వతంత్రంగా పోటీ చేయడానికో స్థానిక టీడీపీ శ్రేణులు వెనుకాడేలా లేవు. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఈ కూటమిలోని అసమ్మతిని అనుకూలంగామార్చుకోవడానికి వేచి చూస్తోంది. నియోజకవర్గ స్థాయిలో చంద్రబాబు, పవన్ ఎంత మైత్రిని ప్రదర్శించినా, పంచాయతీ, వార్డు స్థాయిలో కుటుంబాలు, పాత కక్షలు, వ్యక్తిగత ప్రాబల్యాలే గెలుపోటములనుశాసిస్తాయి. కూటమిలో సీటు దక్కని టీడీపీ లేదా జనసేన అసంతృప్త నేతలు తిరుగుబాటు అభ్యర్థులుగా పోటీ చేస్తే ఓట్లు చీలిపోవడం ఖాయం. ఆ చీలిక ద్వారా తాము పుంజుకోవచ్చని వైఎస్సార్‌సీపీఆశిస్తోంది. ఈ రకమైన సాంప్రదాయ స్థానిక వైరుధ్యాలను అగ్రనేతలు పైస్థాయి నుంచి నియంత్రించడం దాదాపు అసాధ్యమనే చెప్పాలి.ఈ క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొనేందుకు చంద్రబాబు బలం ఉన్న చోట మిత్రపక్షానికే ప్రాధాన్యం అనే ఫార్ములాను ప్రతిపాదించారు. అయితే, ఒక నిర్దిష్ట పంచాయతీలో లేదా వార్డులో టీడీపీకి ఎక్కువ బలముందా, లేక జనసేనకు ఉందా అని తేల్చడం కత్తిమీద సాము లాంటిది.పార్టీ కమిటీల నిర్వహణ, ఉమ్మడి సర్వేలు, నామినేటెడ్ పదవుల హామీలతో అసంతృప్తిని చల్లార్చాలని బాబు-పవన్ ప్రయత్నిస్తున్నప్పటికీ, అధికారం తలుపు తడుతున్న వేళ పదవుల కోసం ద్వితీయశ్రేణి నేతల మధ్య పోటీ రాపిడికి దారితీస్తోంది. రాష్ట్రస్థాయిలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల ఐక్యత ఎంత పటిష్టంగా ఉన్నప్పటికీ, స్థానిక ఎన్నికలు అనేది పూర్తిగా కింది స్థాయి నాయకుల ఉనికి, భవిష్యత్తుకుసంబంధించిన అంశం. పంచాయతీ, మున్సిపాలిటీ స్థాయిలో చోటుచేసుకునే ఫ్రెండ్లీ ఫైట్లు లేదా తిరుగుబాట్లు ప్రధాన కూటమి ఐక్యతను దెబ్బతీయకుండా, కేడర్‌ను సమన్వయం చేయడమే అమరావతి పెద్దలకు రాబోయే రోజుల్లో అతిపెద్ద సవాలు కానుంది.

# ఏపీలో కొత్త పార్టీకి స్పేస్ ఉందా

**విజయవాడ, అక్టోబరు 9,**
ఏపీ రాజకీయం ఎప్పుడూ వేడిమీదే ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో ఏపీ పొలిటికల్ స్క్రీన్‌పై సరికొత్త ట్రెండ్ కనిపిస్తోంది. జడ శ్రవణ్ కుమార్, రిటైర్డ్ ఐఏఎస్ విజయకుమార్, బీసీవై పార్టీ అధినేతరామచంద్ర యాదవ్, మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, మాజీ సీబీఐ జాయింట్ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు, కేకే సర్వేస్ కొండేటి కిరణ్.. చివరికి వైఎస్సార్‌సీపీ నుంచి దూరమైన రాజ్యసభ మాజీఎంపీ విజయసాయిరెడ్డి వరకు కొత్త రాజకీయ వేదికలు, పార్టీలు లేదా స్వతంత్ర రాజకీయం వైపు ప్రయాణిస్తుండటం చర్చనీయాంశమవుతోంది. అసలు ఏపీలో రాజకీయం అంటే అంత సింపుల్‌అయిపోయిందా? ప్రెస్ మీట్లు పెట్టడం, జెండా ఎగరేయడం, కొత్త పార్టీ అని ప్రకటించేయడం ఇంత సులువైన వ్యవహారమా? అనే ప్రశ్నలు సామాన్య ప్రజల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. కొత్త పార్టీలస్థాపన వెనుక ప్రధానంగా మూడే మూడు అంశాలు కనిపిస్తున్నాయి. మొదటిది రిటైర్మెంట్ పొలిటికల్ అంబిషన్ , రెండోది సామాజిక వర్గాల ఆత్మగౌరవ పోరాటాలు , మూడోది ప్రధాన పార్టీల్లో అవకాశాలు దక్కక సొంత దుకాణం తెరవడం! కానీ, క్షేత్రస్థాయిలో ఒక రాజకీయ పార్టీని స్థాపించి, దానిని జిల్లాల వారీగా, మండలాల వారీగా కేడర్‌తో నిర్మించడం, భారీ ఎత్తున ఎన్నికల వ్యయాన్ని తట్టుకోవడం ఎంతసంక్లిష్టమైన విషయమో ఈ కొత్త నేతలు గుర్తించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. కేవలం టివి డిబేట్లు, సోషల్ మీడియా క్లిప్పింగులతో ఎన్నికల్లో నెగ్గుకురావచ్చనే భ్రమలోనే ఈ కొత్త పార్టీల హడావుడి సాగుతోంది.ఇక అసలైన ప్రశ్నకు వస్తే.. ఈ కొత్త రాజకీయ వేదికల్లో ఒక్కటైనా ప్రధాన పార్టీలైన తెలుగుదేశం , వైఎస్సార్‌సీపీ లేదా కూటమిలో భాగమైన జనసేన ఓటు బ్యాంకును చీల్చగలదా? దీనికిసమాధానం ఖచ్చితంగా లేదు అనే వస్తోంది. ఆంధ్రప్రదేశ్ ముఖాముఖి రాజకీయాలకు అలవాటుపడిన రాష్ట్రం. ఇక్కడ ఓటరు చాలా స్పష్టంగా అధికార-ప్రతిపక్షాల మధ్యే తన తీర్పును విభజిస్తాడు. గతంలో విపరీతమైన ప్రజాదరణ ఉన్న సినీ గ్లామర్, భారీ నిధులు ఉన్న చిరంజీవి , సుదీర్ఘకాలం పోరాడిన పవన్ కళ్యాణ్ ( కూడా ఓటు బ్యాంకును సీట్లుగా మార్చడానికి తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. అటువంటిదిఎటువంటి కేడర్, స్పష్టమైన సిద్ధాంతం లేని ఈ చిన్న పార్టీలు ప్రధాన పార్టీల గట్టి ఓటు బ్యాంకును కదిలించడం దాదాపు అసాధ్యం.జడ శ్రవణ్ లేదా రామచంద్ర యాదవ్ వంటి నేతలు బిసి, దళిత సామాజికవర్గాల ఓట్లను ప్రభావితం చేస్తామని ప్రకటిస్తున్నప్పటికీ, ఆయా సామాజిక వర్గాలు ఇప్పటికే సంక్షేమ పథకాలు, పొలిటికల్ రిజర్వేషన్ల ప్రాతిపదికన టీడీపీ-వైఎస్సార్‌సీపీల మధ్య స్పష్టంగా చీలిపోయి ఉన్నాయి. అలాగే రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులైన ఏబీ వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు లేదా సీనియర్ నేత విజయసాయిరెడ్డి వంటి వారు రాజకీయ వేదికలు పెట్టినా.. అవి కేవలం పట్టణ ప్రాంతమేధావులు, మీడియా రచ్చబండలకే పరిమితమవుతాయి తప్ప, గ్రామీణ పోలింగ్ బూత్‌లో ప్రభావం చూపే స్థాయికి వెళ్లలేవు. ఈ పార్టీల వల్ల ప్రధాన పార్టీలకు జరిగే ఒక్కే ఒక్క నష్టం.. ఓట్ల చీలిక ! హోరాహోరీ స్థానాల్లో ఈ చిన్న పార్టీలు లేదా స్వతంత్రులు చీల్చే కొన్ని వందల ఓట్లు ప్రధాన పార్టీల అభ్యర్థుల జాతకాలను తలకిందులు చేసే ప్రమాదం ఉంది. ఉదాహరణకు, బిసివై పార్టీ కొద్దిపాటి ఓట్లనుచీల్చినా, అది ఆ నియోజకవర్గంలో గెలిచే అభ్యర్థి మార్జిన్‌పై ప్రభావం చూపుతుంది. అంటే ఇవి ఓడించే లేదా గెలిపించే బలం లేని పార్టీలే కానీ, వోట్ కట్టర్ గా మాత్రమే ఉపయోగపడతాయి.ఏపీలో కొత్తపార్టీల హడావుడి అనేది కేవలం తాత్కాలిక మీడియా ఆకర్షణ , నేతల వ్యక్తిగత ఉనికి కాపాడుకునే ప్రయత్నం మాత్రమే! ఆంధ్రప్రదేశ్ రాజకీయ ప్లాట్‌ఫామ్‌పై బలమైన బూత్ నెట్‌వర్క్, వేల కోట్ల నిధులనిర్వహణ, పటిష్టమైన కేడర్ లేనిదే మనుగడ సాగించడం సాధ్యం కాదనేది చారిత్రక సత్యం. బాబు, జగన్, పవన్ లీడ్ చేస్తున్న ప్రధాన రాజకీయ కంబైన్లను దాటుకుని ఈ కొత్త కూటములు లేదా పార్టీలు ఒక్కశాసనసభ లేదా లోకల్ బాడీ స్థానాన్ని కూడా సొంతంగా ప్రభావితం చేయలేవని అనుకోవచ్చు.

# 34 శాతం బీసీ వర్గాలకు సాధ్యమేనా

**రాజమండ్రి అక్టోబరు 9,**
ఏపీ రాజకీయం మళ్లీ పాత పద్ధతిలోకే వెళ్లింది. సుప్రీంకోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్ పరిమితి , క్రిష్ణమూర్తి కేసు తీర్పు ఆధారంగా రూపొందించిన ట్రిపుల్ టెస్ట్ విధానాన్ని అధిగమించడం అంత తేలికకాదు అని తెలిసినప్పటికీ, ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా 34% లేదా అంతకంటే ఎక్కువ రిజర్వేషన్ల ప్రతిపాదనతో జీవోలు తీసుకువచ్చింది. చట్టపరంగా నిలబడదని అందరికీ తెలుసు. హైకోర్టులో ఇటువంటినిర్ణయాలు సమీక్షకు వచ్చినప్పుడు 50 శాతం పరిమితి దాటకూడదని స్పష్టం కావడం దీనికి ప్రధాన నిదర్శనం. దీనివల్ల రిజర్వేషన్ల అంశం న్యాయస్థానాల్లో చిక్కుకోవడం, చివరికి పాత పద్ధతిలోనే ఎన్నికలు జరగడం లేదా ఆలస్యం కావడం పరిపాటిగా మారింది.అయితే, సాధ్యం కాదని తెలిసినా రాజకీయ పార్టీలు ఈ తప్పును పదే పదే ఎందుకు చేస్తాయి? అనేదే అసలు ప్రశ్న. దీని వెనుక ప్రధాన కారణం రాజకీయ క్రెడిట్ దక్కించుకోవడం , నెపం ప్రత్యర్థులపైకి నెట్టేయడం . 50 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభా సింహభాగాన్ని ఆకట్టుకోవడానికి ప్రతీ అధికార పార్టీ తాము బీసీలకు గరిష్ట స్థాయిలో స్థానికపదవులు ఇస్తున్నామనే భావనను కల్పించడానికి ప్రయత్నిస్తుంది. ఆ తర్వాత కోర్టులు ఆ నిర్ణయాన్ని కొట్టివేస్తే, మేము ఇవ్వడానికి సిద్ధపడ్డాము కానీ కో ప్రత్యర్థి పార్టీలు వేసిన పిటిషన్ల వల్ల రద్దయ్యాయి అంటూ తమ తప్పును దాచుకునేందుకు , ప్రత్యర్థులను బీసీ వ్యతిరేకులు గా చిత్రీకరించేందుకు ఈ డ్రామా ఉపయోగపడుతుంది. గతంలో వైసీపీ ప్రభుత్వం హయాంలోనూ సరిగ్గా ఇదే తరహా పరిణామాలు చోటుచేసుకున్నాయి. 34% రిజర్వేషన్ జీవోలు తేవడం, అది కోర్టుల్లో రద్దు కావడం, ఆపై 24% కు తగ్గించి ఎన్నికలు నిర్వహించారు. ఇప్పుడు టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కూడా అదే తరహానిర్ణయాలతో ముందుకు వెళ్తోంది. ఇక తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విషయంలోనూ కుల గణన, బీసీ రిజర్వేషన్ల పెంపు హామీల చుట్టూ ఇవే న్యాయపర మైన సవాళ్లు దాగి ఉన్నాయి. చట్టపరమైనవెసులుబాటు , సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసన తీర్పుల పరిమితిపై స్పష్టత ఉన్నప్పటికీ ఏ పార్టీ కూడా నిజం చెప్పే సాహసం చేయడం లేదు. ఒకవేళ పొలిటికల్ పార్టీలకు బీసీలకు న్యాయం చేయాలనేనిజమైన కట్టుబడి ఉంటే, చట్టపరమైన రిజర్వేషన్ల శాతం కోసం కోర్టులను ఆశ్రయించి కాలయాపన చేయడం కంటే పార్టీ బి-ఫామ్‌ల కేటాయింపులో తమ నిజాయితీని నిరూపించుకోవచ్చు.మునిసిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు లేదా కార్పొరేషన్ ఎన్నికల్లో చట్టబద్ధంగా వచ్చే రిజర్వేషన్ శాతానికి అదనంగా, పార్టీల తరపున జనరల్ స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులకే టికెట్లు ఇచ్చి గెలిపించేవెసులుబాటు రాజకీయ పార్టీలకు ఉంది. కానీ ఏ పార్టీ కూడా జనరల్ స్థానాలను బీసీలకు ఇచ్చేందుకు సిద్ధపడదు. కేవలం రాజ్యాంగ పరిమితులకు లోబడి ఉండే ప్రభుత్వ రిజర్వేషన్ల పేరు చెప్పి కాలంవెళ్లదీస్తాయి. ఏ ప్రభుత్వం వచ్చినా ఈ రిజర్వేషన్ల కంటితుడుపు చర్యలు కేవలం ఎన్నికల నాటికి ఓటర్లను మభ్యపెట్టడానికే తప్ప క్షేత్రస్థాయిలో బీసీలకు దక్కే నికర ప్రయోజనం శూన్యమని నెటిజన్లుతీవ్రంగా విమర్శిస్తున్నారు.కోర్టు తీర్పుల సాకుతో పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు వెళ్లడం, పొలిటికల్ మైలేజ్ మాత్రం పొందే ప్రయత్నం చేయడం పరిపాటిగా మారింది.చట్టం పరిధి తెలిసీ ప్రజలను ఆశల్లో ముంచెత్తడం, ఆ తర్వాత న్యాయస్థానాల వైపు వేలు చూపించడం అనేది ఏపీ . ఇతర రాష్ట్రాల రాజకీయాల్లో ఒక ఫార్ములాగా మారిపోయింది. రాజకీయ పార్టీలు ఈ డ్రామాలను పక్కనపెట్టి, నిజాయితీగా పార్టీటికెట్ల పంపిణీలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదా రాజ్యాంగ సవరణల దిశగా జాతీయ స్థాయిలో ఒత్తిడి తేడమే నిజమైన పరిష్కారమని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

## ఎన్నికలు వాయిదా సాధ్యమేనా

**నెల్లూరు, అక్టోబరు 9,** : ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ ఎన్నికలకు ముందే రాజకీయ వేడి రాజుకుంది. ఒకవైపు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయం.. మరోవైపు అదే రిజర్వేషన్లను కోర్టులో సవాలు చేసినపిటిషన్లు.. తాజాగా హైకోర్టు తీర్పు.. ఆ తర్వాత సుప్రీంకోర్టు మెట్లెక్కిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇదంతా కేవలం న్యాయపరమైన వివాదమేనా? లేక స్థానిక ఎన్నికల వెనుక పెద్ద రాజకీయ వ్యూహంనడుస్తోందా?ఆగస్టు 20, 2026న ఏపీ ప్రభుత్వం జారీ చేసిన +.వా.వీం.చీశీ.105 ద్వారా పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయించింది. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు కలిపి 50 శాతం పరిమితిని దాటుతున్నాయంటూ పిటిషన్లు దాఖలయ్యాయి. అక్టోబర్ 1న ఏపీ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. 34 శాతం బీసీ రిజర్వేషన్‌కు సంబంధించినప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేస్తూ.. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను వీలైనంత త్వరగా గరిష్ఠంగా ఆరు వారాల్లో ప్రారంభించాలని ఆదేశించింది.వైసీపీ వర్గాలు మాత్రం 34 శాతం బీసీ కోటా చట్టపరమైనపరిమితులను దాటుతుందని ముందే హెచ్చరించామని చెబుతున్నాయి. వైసీపీ అధికారిక వాదన ప్రకారం.. ప్రభుత్వం చట్టపరమైన సమస్యలు వస్తాయని తెలిసినా 34 శాతం కోటాను ప్రకటించి తర్వాత కోర్టుఅడ్డంకిని రాజకీయంగా ఉపయోగించుకుంటోందని ఆరోపిస్తోంది. మరోవైపు కూటమి ప్రభుత్వం మాత్రం బీసీలకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతోనే 34 శాతం రిజర్వేషన్ తీసుకొచ్చామని చెబుతోంది.వైసీపీఅధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్థానిక ఎన్నికలను ఎదుర్కోవడానికి భయపడుతున్నారని, అందుకే బీసీ రిజర్వేషన్ల అంశాన్ని న్యాయపరమైన వివాదంగా మార్చి ఎన్నికలను ఆలస్యం చేయాలనిచూస్తున్నారని కూటమి వర్గాలు ఆరోపిస్తున్నాయి.పంచాయతీ ఎన్నికలు జరిగితే గ్రామస్థాయిలో అధికార పార్టీ, ప్రతిపక్షాల బలాబలాలు స్పష్టంగా బయటపడతాయి. ఎవరి క్యాడర్ బలంగా ఉంది? ఎవరినాయకత్వానికి గ్రామాల్లో ఆదరణ ఉంది? ఏ సామాజిక వర్గం ఎటువైపు నిలుస్తోంది? అన్నది ఎన్నికల ఫలితాలతో తేలిపోతుంది. అందుకే స్థానిక ఎన్నికలే ఇప్పుడు రెండు ప్రధాన పార్టీలకు రాజకీయపరీక్షగా మారాయి.స్థానిక సంస్థలకు కేంద్ర, రాష్ట్ర స్థాయిలో వివిధ గ్రాంట్లు, ఆర్థిక సంఘాల నిధులు, అభివృద్ధి నిధులు అందుతాయి. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2021-26 కాలానికి ఆంధ్రప్రదేశ్ గ్రామీణస్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం కింద రూ.10,231 కోట్ల కేటాయింపు ఉండగా రూ.10,055.82 కోట్లు విడుదలయ్యాయి. అయితే రూ.12,000 కోట్ల "పే కమిషన్ నిధులు"ఎన్నికలను ఆపడానికి జగన్ చేస్తున్న కుట్రలో భాగమే ఈ ఎన్నికలు అడ్డుకునే ప్రక్రియ అనే వాదన వినిపిస్తోంది.బీసీ రిజర్వేషన్లను వైసీపీ ఎందుకు అడ్డుకుంటోంది.? ప్రభుత్వం తీసుకొచ్చిన 34 శాతంకోటా చట్టపరమైన పరీక్షను ఎందుకు మోకాలడ్డుతోంది.? టీడీపీకి ఎన్నికల్లో ప్రయోజనం దక్కుండా చేసేందుకే ఈ కుట్ర చేస్తోంది.? ఎన్నికలు ఆలస్యం అయితే రాజకీయంగా వైసీపీకి లాభమా? గ్రామీణస్థాయిలో బలాబలాలు బయటపడకుండా ఎన్నికల ప్రక్రియను సాగదీయడం వైసీపీ వ్యూహమా? ఈ ప్రశ్నలకు సమాధానాలు రాబోయే రోజుల్లో కోర్టు తీర్పులతో పాటు రాజకీయ పరిణామాలు కూడాఇవ్వనున్నాయి.ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసింది. అక్టోబర్ 9న ఈ అంశంపై సుప్రీంకోర్టులో తదుపరి విచారణ జరగనుంది. కాబట్టి.. ఇది కేవలం 34 శాతం బీసీరిజర్వేషన్ వివాదం కాదు. ఇది గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ఆధిపత్యం కోసం జరుగుతున్న మరో పెద్ద పోరాటం.ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయి? బీసీలకు చివరకు ఎంత రిజర్వేషన్ దక్కుతుంది?కోర్టు నిర్ణయం ఎటువైపు ఉంటుంది? మరి ఈ మొత్తం వ్యవహారంలో రాజకీయంగా లాభపడేది ఎవరు? సమాధానం కోసం రాబోయే పరిణామాలను గమనించాల్సిందే!

## అర్ధరాత్రి ఫిషింగ్ హార్బర్ పనులను పరిశీలిచిన మంత్రి కొల్లు

**మచిలీపట్నం** మంత్రి కొల్లు రవీంద్ర గురువారం అర్ధరాత్రి మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ కు వెళ్లారు. అర్థాంతంగా పనులు నిలిపి వేయడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసారు. అధికారుల బాధ్యతారాహిత్యం, గుత్తేదారు నిర్లక్ష్యవైఖరిపై అసహనం వ్యక్తం చేసారు. హార్బర్ నుండే కలెక్టర్ కు ఫోన్ చేసి మాట్లాడారు. కాంట్రాక్టర్ ఉద్దేశ్య పూర్వకంగా పనులు జాప్యం చేస్తున్నారని కలెక్టర్ కి ఫిర్యాదు చేసారు. మీరెందుకు దృష్టి పెట్టడం లేదనికలెక్టర్ ని ప్రశ్నించారు. మూడేళ్ల కాలపరిమితితో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఐదేళ్లు పూర్తయినా ఎందుకు పనులు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలని నిలదీసారు. అవసరమైతే కాంట్రాక్ట్ టెర్మినేట్ చేయాలని కలెక్టర్ కు ఆదేశాలు ఇచ్చారు. ఉన్నత స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్ కు సూచించారు. పనులు పూర్తి చేయడానికి నాలుగు నెలలు సమయం ఇవ్వాలని మంత్రిని గుత్తేదారు కోరారు. ఇంకెంత సమయం ఇవ్వాలని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇప్పటికే రెండు సంవత్సరాలు కాల పరిమితిని పెంచినా పురోగతి లేదని మండిపడ్డారు. సీ మౌత్ డిజైన్ రాకపోవడం వల్ల పనుల్లో ఆలస్యం అయిందని గుత్తేదారు తెలిపాడు. కుంటిసాకులు ఇంకెన్ని రోజులు చెబుతారని గుత్తేదారుపై మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. ఇకపై ఉపేక్షించేది లేదని హెచ్చరికలు జారీ చేసారు. తక్షణం పనులు ప్రారంభించి నిర్ణీత సమయంలో పూర్తి చేయకపోతే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అవసరమైతే కాంట్రాక్ట్ టెర్మినేట్ చేసి కాంట్రాక్టర్ ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు.

## రఘురామకు స్థానిక సంస్థల ఎన్నికల సెగ తగిలే ఛాన్స్ ఉందా?

ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజుకు స్థానిక సంస్థల ఎన్నికల్లో సెగ తగిలే అవకాశముంది. ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణ రాజు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే ఆయన బలపర్చిన అభ్యర్థులకు కూటమిలోని నేతలే ప్రశ్నించే అవకాశాలున్నాయి. కూటమి పార్టీల ఓట్ల బదిలీపై కూడా అనుమానం తలెత్తుతుంది. పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల




రాజకీయాలపై వివిధ రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహిస్తున్న తొలి స్థానిక సంస్థల ఎన్నికలు ఇవి కావడంతో, రఘురామ కృష్ణరాజు సొంత నియోజకవర్గమైన ఉండిలో పార్టీని గెలిపించుకోవడం ఆయనకు ప్రతిష్టాత్మకంగా మారింది. ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయిన తర్వాత అనేక వివాదాలకు కేంద్రంగా మారారు. అదే సమయంలో సొంత పార్టీ నేతలను కూడా దూరం చేసుకున్నారు. అదే సమయంలో కూటమిలోని ఇతర పార్టీల నేతలు కూడా రఘురామ కృష్ణరాజు ను సమర్థించేవాళ్లు తక్కువగా ఉన్నారు.

**టిక్కెట్ల కేటాయింపు నుంచి...**
ఉండి నియోజకవర్గంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నేతల మధ్య స్థానిక సంస్థల టికెట్ల కేటాయింపులో సయోధ్య కుదర్చడం రఘురామకృష్ణరాజుకు అత్యంత కీలకమైన అంశం. స్థానిక నేతల ఆశలు, అసంతృప్తులను సమన్వయం చేసుకోకపోతే అంతర్గత పోరు తగిలే అవకాశం ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి 34 శాతం బీసీ రిజర్వేషన్లకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇటీవలే మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తుది నిర్ణయం ఆధారంగా మరికొద్దిరోజుల్లోనే టికి ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంది. ఈ రిజర్వేషన్ల రొటేషన్ ప్రక్రియలో స్థానిక సమీకరణాలను బట్టి అభ్యర్థులను ఖరారు చేయడం స్థానిక ఎమ్మెల్యేగా రఘురామ కృష్ణరాజుకు ఒక పరీక్ష వంటిదే. గత ఎన్నికల్లో చివరి నిమిషంలో ఉండి నియోజకవర్గం ఎమ్మెల్యే టిక్కెట్ ను రఘురామ కృష్ణరాజు పొందగలిగారు.

**వైసీపీ కొంత కసిగానే...**
రఘురామ కృష్ణరాజు వాస్తవానికి పార్లమెంటుకు పోటీ చేయాలని భావించినా అది వీలు కాలేదు. వైసీపీ నుంచి బయటకు వచ్చి బీజేపీలో చేరదామని భావించి తిరిగి చివరి నిమిషంలో టీడీపీలో చేరి ఉండి టిక్కెట్ దక్కించుకున్నారు. రఘురామ కృష్ణరాజు గౌరవ ప్రదమైన డిప్యూటీ శాసనసభ స్పీకర్ పదవి లభించింది. అయితే ఆయన ఉండి నియోజకవర్గంలో తీసుకున్న పలు నిర్ణయాలు ఇబ్బందికరంగా మారాయి. మరొకవైపు ఆక్వా రైతులు కూడా దెబ్బకొట్టే అవకాశముంది. గతంలో వైఎస్సార్‌సీపీ నుంచి ఎంపీగా గెలిచి, ఆ తర్వాత ఆ పార్టీతో విభేదించి టీడీపీలో చేరిన రఘురామకృష్ణరాజుపై ఎలాగైనా పైచేయి సాధించాలని ప్రతిపక్ష వైసీపీ వ్యూహాలు ప్రతివ్యూహాలు రచిస్తోంది. ఉండి నియోజకవర్గ పరిధిలో స్థానిక ఎన్నికల ద్వారా తమ బలాన్ని నిరూపించుకోవాలని ప్రతిపక్షం గట్టిగా ప్రయత్నిస్తోంది.ప్రస్తుతం డిప్యూటీ స్పీకర్ హోదాలో రఘురామకృష్ణరాజు నియోజకవర్గంలో స్థానిక అభివృద్ధి కార్యక్రమాలు, దాతల సహకారంతో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టారు. క్షేత్రస్థాయిలో కూటమి ఓటు బ్యాంకును పటిష్టం చేసుకుంటూ, అసంతృప్తులను చల్లార్చగలిగితే ఎన్నికల సెగను తట్టుకుని ఆయన తన పట్టును నిలుపుకోగలరా? అన్నదే ప్రశ్న. చూడాలి రఘురామ ఈ స్థానిక సంస్థలను ఎలా నెగ్గుకొస్తారో...?

# “ఓట్ల దొంగతనం” జరుగుతోంది

దేశంలో “ఓట్ల దొంగతనం” జరుగుతోందంటూ తాము చేసిన ఆరోపణలకు సంబంధించి ఆధారాలు సమర్పించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తమను కోరినట్లు లోక్‌సభ విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ వెల్లడించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ చుట్టూ అలుముకున్న వివాదంపై శుక్రవారం ఇండియా కూటమి నేతలు రాష్ట్రపతిని కలిసిన అనంతరం ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ సహా పలువురు విపక్ష నేతల ప్రతినిధి బృందం రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపది ముర్ముతో సమావేశమైంది. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, భారత ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ వారు రాష్ట్రపతికి ఒక వినతిపత్రం సమర్పించారు.

సమావేశం అనంతరం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కలిసి భారత ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని రాష్ట్రపతికి తెలియజేశామని చెప్పారు. “మా ఆరోపణలను నిరూపించేందుకు ఆధారాలు ఇవ్వాలని ఆమె కోరారు. ఆమెకు సమయం ఉన్నప్పుడు తప్పకుండా ఆధారాలను సమర్పిస్తాం” అని రాహుల్ తెలిపారు. రాష్ట్రపతి తమ వాదనలను తిరస్కరించలేదని, ప్రశ్నించలేదని, సమావేశం సంతృప్తికరంగా జరిగిందని ఆయన పేర్కొన్నారు.

ఈ అంశంపై సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించి, ప్రధాన న్యాయమూర్తికి కూడా ఒక వినతిపత్రం అందజేస్తామని రాహుల్ ప్రకటించారు.



కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. రాష్ట్రపతి తమ వాదనలను ఓపికగా విన్నారని తెలిపారు. “ఓట్ల దొంగతనంపై మేం నాలుగు రోజులుగా చేస్తున్న ఆందోళనల గురించి రాష్ట్రపతికి వివరించాం. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ చేసిన తీవ్రమైన తప్పిదాన్ని, ఎన్నికల కమిషన్ పనితీరుపై మా ఆందోళనలను తెలియజేశాం. ఈవీఎంలను పక్కనపెట్టి, బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించాలని మేం డిమాండ్ చేశాం” అని ఖర్గే వివరించారు.

టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ మాట్లాడుతూ.. “మేం వినతిపత్రం ఇచ్చాం. దీనిపై విచారణ జరుపుతానని, వివరాలు పరిశీలిస్తానని, ఆధారాలు కావాలని ఆమె చెప్పడాన్ని మేం సానుకూల దృక్పథంతో చూస్తున్నాం. దేశ ప్రజలు ఆందోళనగా ఉన్నారు, రాజ్యాంగ పరిరక్షకురాలిగా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆమెను కోరాం” అని అన్నారు.

ఈ ప్రతినిధి బృందంలో జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఎన్సీపీ-ఎస్పీ ఎంపీ సుప్రియా సూలే, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీ, ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రాజీవ్ రాయ్ తదితరులు పాల్గొన్నారు. గత కొద్ది రోజులుగా ఎన్నికల కమిషన్, ఓటర్ల జాబితా సవరణ తీరుపై విపక్షాలు నిరసనలు వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే.

# ‘జెన్ జీకి భయపడుతున్న కేంద్రం

దిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (జజీపీ) అక్టోబర్ 10న భారీ ఎత్తున నిరసన నిర్వహించనున్నట్లు పిలుపునివ్వగా దేశ రాజధానిలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇక్కడ మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు, ప్రజా రవాణాపై ఆంక్షలు విధించిన నేపథ్యంలో సీజేపీ నేతలు కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ నిరసనను అడ్డుకోవడానికి కేంద్రం దిల్లీని సైనిక కోటలా మార్చిందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో తీవ్ర అవకతవకలు జరిగాయని ఆరోపిస్తున్న సీజేపీ దీనికి బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తుంది. ఇందులో భాగంగానే దిల్లీ జంతర్ మంతర్ వద్ద శనివారం నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపింది. ఈ క్రమంలోనే బెంగళూరు నుంచి తిరుగుపయనం అవుతూ ముంబై విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే. తమ నిరసనను అడ్డుకోవడానికి ప్రజల రాకపోకలపై ఆంక్షలు విధించడం సరికాదని, వారిని ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని ప్రశ్నించారు. శనివారం జంతర్ మంతర్ వద్ద నిర్వహించ తలపెట్టిన నిరసనను విరమించుకోబోమని స్పష్టం చేశారు. జెన్ జీని చూసి కేంద్రం భయపడుతోందని వ్యాఖ్యలు చేసిన దీప్కే- యువతను చూసి అంతగా భయపడుతుంటే దేశం మొత్తాన్ని మూసేయండని ఆగ్రహం వ్యక్తం చేశారు. దిల్లీ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాల ప్రైవేట్ ప్రాపర్టీ ఏం కాదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

నిరసనల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఒకవైపు చెబుతూనే, మరోవైపు మెట్రో స్టేషన్లు, రైళ్ల రాకపోకలపై ఆంక్షలు విధించడం వల్ల ప్రజలకు మరింత




ఇబ్బంది కలగదా? అని ప్రశ్నించారు. కేంద్రం చర్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని అభిజీత్ తెలిపారు. కశ్మీర్, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల నుంచి భద్రతా బలగాలను దిల్లీకి ఎందుకు తరలిస్తున్నారని, యువతను పాకిస్థానీలను చూసినట్లు చూస్తుందని దీప్కే మండిపడ్డారు. తనను అరెస్ట్ చేయడం వల్ల సమస్యలు పరిష్కారమవుతాయని ప్రభుత్వం భావిస్తే, ధైర్యముంటే తనను అరెస్ట్ చేయాలని సవాల్ విసిరారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ చేసిన దానికి ఆయన శిక్ష అనుభవించాలని, సర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇక దిల్లీలో ప్రస్తుత పరిస్థితులను ఎమర్జెన్సీతో పోల్చారు మరో సీజేపీ నేత సౌరవ్ దాస్. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పార్టీ కార్యకర్తలను నిర్బంధిస్తున్నారని, కొందరిని గృహ నిర్బంధం చేశారని ఆరోపించారు. ఆంక్షలు, పరిమితులతో దిల్లీని కోటలా మార్చారని విమర్శించారు.

### మెట్రో, రైళ్లపై ఆంక్షలు- సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు

సీజేపీ నిరసనల నేపథ్యంలో రవాణా మార్గాలపై ప్రభుత్వం విధించిన ఆంక్షలపై దాఖలైన విజ్ఞప్తులను పరిశీలించిన సుప్రీం కోర్టు గురువారం కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రధాన న్యాయమూర్తి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ- నిరసనల కారణంతో మెట్రో రైళ్లు, ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయకూడదని స్పష్టం చేసింది. గురుగ్రామ్, గ్రేటర్ నోయిడా నుంచి దిల్లీకి వచ్చే విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని వ్యాఖ్యానించింది. రవాణా సేవలపై తీసుకునే నిర్ణయాలను ప్రజలకు తప్పనిసరిగా ముందుగానే తెలియజేయాలని సూచించింది. నిరసనలకు జంతర్ మంతర్‌నే కొనసాగించాలా? ప్రత్యామ్నాయ ప్రదేశాన్ని చూడాలా? అనే అంశాన్ని కూడా కేంద్రం పరిశీలించాలని పేర్కొంది.

### దిల్లీ పోలీసుల ఉన్నత స్థాయి సమీక్ష- ఇంటర్నెట్ బంద్

సీజేపీ నిరసనల నేపథ్యంలో దిల్లీ పోలీస్ కమిషనర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్నతాధికారులు అత్యవసర సమావేశం నిర్వహించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. కేంద్ర హోం శాఖ ఆమోదంతో జంతర్ మంతర్ పరిసరాల్లో 4 కిలోమీటర్ల పరిధిలో అక్టోబర్ 9 రాత్రి 10 గంటల నుంచి అక్టోబర్ 10 రాత్రి 10 గంటల వరకు మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. న్యూదిల్లీ జిల్లా పరిధిలో దీంతో సెక్షన్ 163 అమల్లో ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని పోలీసులు హెచ్చరించారు. ఇంకా ‘యాన్ ఓపెన్ లెటర్ టు ఎవ్రీ సిటిజెన్’ పేరుతో ప్రతి ఒక్కరూ శాంతి భద్రతలకు సహకరించాలని పోలీసులు ఎక్స్ వేదికగా బహిరంగ లేఖను కూడా విడుదల చేశారు.

# నీట్ విధానంలో మరిన్ని సంస్కరణలు

ఈ ఏడాది నీట్ యూజీ 2026 ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణలు, పరీక్ష రద్దు నేపథ్యంలో ఈ వ్యవహారంపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తన రిపోర్టును విడుదల చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో పారదర్శకతను పెంచడానికి, అక్రమాలను అరికట్టేందుకు కీలక సంస్కరణలను ప్రతిపాదించింది. ఇక్కడ ఎన్టీఏ పార్లమెంటుకు (లోక్‌సభ, రాజ్యసభ) జవాబుదారీగా ఉండేలా చట్టపరమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని విద్యా వ్యవహారాలపై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయీ సంఘం సూచించింది. పరీక్షల నిర్వహణపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సహా ప్రజల్లో నమ్మకాన్ని నిలబెట్టడం చాలా ముఖ్యమని స్పష్టం చేసింది. పరీక్షలపై విశ్వాసం దెబ్బతినకుండా చూసేందుకు తగిన పార్లమెంటరీ వ్యవస్థను విద్యాశాఖ ప్రవేశపెట్టాలని కమిటీ తెలిపింది. పరీక్షల్లో అక్రమాలకు పాల్పడాలనుకునే వ్యవస్థీకృత నెట్‌వర్క్‌లు నిరంతరం కొత్త మార్గాలను అన్వేషిస్తుంటాయని, పరీక్ష నిర్వహణలోని బలహీనతలను ఉపయోగించుకునేందుకు చూస్తాయని పేర్కొంది.

ఈ నేపథ్యంలో అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ నీట్ యూజి 2026 పరీక్షను రద్దు చేయాల్సి రావడం మాత్రం సంస్థాగత, విధానపరమైన లోపాలను సృష్టిస్తోందని కాంగ్రెస్ ఎంపీ దిగ్విజయ సింగ్ నేతృత్వంలోని ఈ కమిటీ అభిప్రాయపడింది. అందుకే ఎన్టీఏలో తగినంత సిబ్బంది, పటిష్టమైన భద్రతా విధానాలు, స్పష్టమైన జవాబుదారీ వ్యవస్థలు ఉండాలని సూచించింది. ముఖ్యంగా చీూా ప్రశ్నాపత్రాలను తయారు చేసే అధ్యాపకులు, నిపుణుల గత చరిత్ర ముఖ్యంగా నైతికతను పరిశీలించడానికి ఒక ప్రత్యేక ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. క్వశ్చన్ పేపర్లు తయారు చేసే వారికి కూడా ఏ ప్రశ్నలు పరీక్షలు వస్తున్నాయో ముందుగా తెలియకుండా ఉండేలా



ఎన్టీఏ పెద్ద క్వశ్చన్ బ్యాంకులను రూపొందించాలని స్పష్టం చేసింది.

### ఆటోమేటెడ్ సిస్టమ్ ద్వారా ప్రశ్నలు!

ఇదే సమయంలో కంప్యూటర్ బేస్డ్ ఆటోమేటెడ్ సిస్టమ్ ద్వారా చివరి క్షణంలో ప్రశ్నలను ఎంపిక చేసే విధానం రావాలని కమిటీ పేర్కొంది. పెన్ అండ్ పేపర్ పద్ధతిలో నిర్వహించే నీట్‌లో ప్రశ్నా పత్రాల లీకేజీ ప్రమాదం ఎక్కువగా ఉందన్న కమిటీ, దీనిని అధిగమించడానికి నీట్ యూజీని పూర్తి స్థాయిలో కంప్యూటర్ బేస్డ్ టెస్టుగా నిర్వహించాలని రికమెండ్ చేసింది. ఇదే సమయంలో ప్రైవేట్ పరీక్షా కేంద్రాలపై ఆధారపడటాన్ని తగ్గించి, ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థలు, డిజిటల్ కేంద్రాల ద్వారానే ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని సూచించింది. కొన్ని కారణాల వల్ల పరీక్ష కేంద్రాలకు కొద్దిగా ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అండర్‌టేకింగ్ తీసుకొని పరీక్ష రాయడానికి అనుమతించాలని పార్లమెంటరీ ప్యానెల్ పేర్కొంది.

### మే 3న పరీక్ష- తర్వాత రద్దు- రీ ఎగ్జామ్!

ఈ ఏడాది మే 3న దేశవ్యాప్తంగా 551 నగరాలు, విదేశాల్లోని 14 కేంద్రాల్లో నీట్ యూజీ పరీక్ష నిర్వహించగా, సుమారు 22 లక్షల మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. అయితే వ్యవస్థీకృత ముఠాలు ప్రశ్నాపత్రాన్ని లీక్ చేశారన్న ఆరోపణలతో మే 12న ఎన్టీఏ ఈ పరీక్షను రద్దు చేసింది. తర్వాత కేంద్ర ప్రభుత్వం ఆమోదంతో జూన్ 21న నీట్ యూజీ 2026 రీ ఎగ్జామ్ నిర్వహించారు. ఇక ఈ కేసును విచారించిన కేంద్ర దర్యాప్తు సంస్థ - ఒక కెమిస్ట్రీ లెక్చరర్‌ను అరెస్ట్ చేసింది. పరీక్షకు ముందే పుణెలోని ఒక స్పెషల్ కోచింగ్ క్లాస్‌లోని విద్యార్థులకు ఆయన ప్రశ్నలు, ఆప్షన్లు, సరైన సమాధానాల్ని చెప్పారని, అవి అసలు ప్రశ్నా పత్రంతో సరిపోలాయని సీబీఐ కూడా నిర్ధారించింది. ఈ నేపథ్యంలో విద్యార్థులు, ఇతర పౌర సమాజ సంస్థలు, ప్రతిపక్షాలు దీనిపై పెద్ద ఆందోళన నిర్వహించాయి. దిల్లీ జంతర్ మంతర్ కేంద్రంగా అభిజీత్ దీప్కే నేతృత్వంలో కాక్రోచ్ జనతా పార్టీ చేసిన నిరసనలు చాలా రోజులు కొనసాగాయి. ఈ క్రమంలోనే అప్పటి విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామాకు డిమాండ్ చేయగా, కొన్ని రోజులకు ఆయన తప్పుకున్నారు. ఆయన స్థానంలో ప్రహ్లాద్ జోషిని కేంద్రం విద్యాశాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. అయినా అప్పటి నుంచి కాంగ్రెస్ సహా ఇతర విపక్ష పార్టీలు దేశంలో పరీక్షల నిర్వహణపై, విద్యా వ్యవస్థపై ప్రశ్నిస్తూనే ఉన్నాయి.

## ‘ఏ రంగంలోనూ గుత్తాధిపత్యాన్ని భారత్ అనుమతించదు’

భారత్‌లో ఏ రంగంలోనూ గుత్తాధిపత్యాన్ని అనుమతించదని కేంద్ర కమ్యూనికేషన్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను అందించేందుకు భారత్‌లో తమ సంస్థను అనుమతించడం లేదని స్టార్‌లింక్ అధిపతి ఎలాన్ మస్క్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో శుక్రవారం ఆయన ఈ మేరకు స్పందించారు. ప్రస్తుతం ఒక కంపెనీ గురించి అందరూ ఎక్కువగా చర్చిస్తున్నారని సింధియా తెలిపారు. వాస్తవానికి ఇప్పటికే మూడు కంపెనీలకు శాట్‌కామ్ లైసెన్సులు మంజూరు చేసినట్లు సింధియా వెల్లడించారు. అయితే, భద్రతా ప్రమాణాలు, నిర్దేశిత మార్గదర్శకాలను నెరవేర్చిన తర్వాతే ఆయా సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించగలవని సింధియా స్పష్టంచేశారు. ఫ్రీ మార్కెట్‌లో వినియోగదారులు తమకు నచ్చిన సేవలను ఎంచుకుంటారని, వారికి పలు ఆప్షన్లను అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. మస్క్‌కు మద్దతు తెలుపుతూ రాహుల్ చేసిన పోస్టుపైనా ఆయన మండిపడ్డారు. గతంలో ఒక నిర్దిష్ట వ్యక్తికి లైసెన్స్ ఇవ్వడంపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసిందని అన్నారు. ఇప్పుడు అదే వ్యక్తితో చేతులు కలిపి ఆయనకు లైసెన్స్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించడం ఆ పార్టీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని సింధియా విమర్శించారు.

### తీవ్ర దుమారం రేపుతున్న మస్క్ వ్యాఖ్యలు

స్టార్‌లింక్‌ను భారత్‌లోకి రాకుండా కొందరు శక్తిమంతులు అడ్డుకుంటున్నారని ఎలాన్ మస్క్ ఇటీవల ఆరోపించారు. వారు టెలికాం రంగంలో గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారన్న మస్క్, ఇండియాకు అంబానీయే బాసా? అని అన్నారు. మస్క్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం దుమారం రేపుతున్నాయి. అయితే, మస్క్? వ్యాఖ్యలను భారత్ ఖండించింది. శాటిలైట్ ఇంటర్నెట్ సేవలపై స్టార్‌లింక్ సహా జియో, ఎయిర్‌టెల్ వంటి భారత సంస్థలు దరఖాస్తు చేసుకున్నాయని, ఇప్పటివరకు దేనికీ పూర్తిస్థాయి అనుమతులు ఇవ్వలేదని తెలిపింది. ఆ మూడు సంస్థలూ ఒకే దశలో ఉన్నాయని తెలిపిన ప్రభుత్వం భద్రతా ప్రమాణాల తనిఖీల తర్వాత మాత్రమే స్పెక్ట్రమ్ కేటాయింపులు ఉంటాయని వివరించింది. మరోవైపు, మస్క్ ఆరోపణల వెనుక భారతీయుల మీద ప్రేమ కంటే, తన వ్యాపార, అమెరికా వ్యూహాత్మక ప్రయోజనాలే దాగి ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేశ భద్రతను పణంగా పెట్టి, భారత సంపదను కొల్లగొట్టే మస్క్ స్టార్‌లింక్ మనకు నిజంగా అవసరమా అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ప్రపంచంలో చౌకగా డేటా దొరికే భారత్‌లో ఈ వ్యవహారంపై నిపుణులు, నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఉక్రెయిన్, ఇరాన్, ఇజ్రాయెల్ వంటి దేశాల్లో స్టార్‌లింక్ సేవలను అమెరికా తన భౌగోళిక రాజకీయ ప్రయోజనాల కోసం ఒక ఆయుధంగా వాడుకుంటోందని అలాంటి సాంకేతికత విషయంలో భారత ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించడం సమంజసమేనని విశ్లేషకులు చెబుతున్నారు. మస్క్ చెబుతున్న ‘చౌక’ ఇంటర్నెట్ వాదనను నెటిజన్లు, నిపుణులు డేటాతో సహా తీవ్రంగా ఎండగడుతున్నారు. ప్రస్తుతం భారత్‌లో 100 ఎంబీపీఎస్ వేగమున్న ఇంటర్నెట్ కోసం నెలకు సగటున రూ.700 నుంచి రూ.900 రూపాయలు మాత్రమే ఖర్చవుతోంది. అదే చైనాలో రూ.2,000 నుంచి రూ.3,000 వరకు ఉంది. కానీ, మస్క్ స్టార్‌లింక్ ఇంటర్నెట్ వాడాలంటే నెలకు రూ. 8,000 చెల్లించాలి. దానికి తోడు పరికరాల ఇన్‌స్టాలేషన్ కోసం అదనంగా వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుందని నెటిజెన్లు పోస్టులు పెడుతున్నారు. నెలకు ఏడు వందలు కట్టే భారతీయులకు, రూ. 8,000కు పైగా వసూలు చేసే స్టార్‌లింక్ ఏ రకంగా చౌక అవుతుందని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ఇది కచ్చితంగా దేశ సంపదను భారీగా కొల్లగొట్టి బయటకు తరలించడమేనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు భారత టెలికాం రంగంలో పోటీ కొరవడి కేవలం కొన్ని సంస్థల ఆధిపత్యమే కొనసాగుతోందన్న మస్క్ వాదనలో నిజం లేకపోలేదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. డేటా ధరలు తక్కువగా ఉన్నప్పటికీ, నెట్‌వర్క్ నాణ్యత మాత్రం నాసిరకంగా ఉంటోందని టెలికాం రంగంలో పోటీ పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని మరికొందరు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

### వ్యాపారానికి కాదు, గుత్తాధిపత్యానికే మేము వ్యతిరేకం

దేశంలో ప్రతి వ్యాపార సంస్థకు కూడా సమానంగా అవకాశాలు ఉండాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. కేవలం రాజకీయ అండతోనే కొన్ని సంస్థలకు ప్రత్యేకంగా ప్రయోజనం కల్పించే విధానాన్ని అంతం చేసి, పోటీ వాతావరణాన్ని కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఆవిష్కరణలు, కష్టపడి పనిచేసే తత్వంపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థను నిర్మించడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. భారత్‌లో స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు వాణిజ్యపర అనుమతులు ఇంకా లభించలేదని స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఈ చర్చ మొదలైంది. గురువారం రోజు మస్క్ చేసిన ఎక్స్ పోస్టుకు రాహుల్ బదులివ్వడం, మళ్లీ మస్క్ థ్యాంక్యూ చెప్పారు. తాను వ్యాపారాలకు వ్యతిరేకం కాదని, కేవలం గుత్తాధిపత్యానికే వ్యతిరేకమని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఈ మేరకు రాహుల్ తన వాట్సాప్ ఛానల్ ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ పురోగతి సాధించాలంటే ప్రతీ చిన్నా, పెద్ద వ్యాపార సంస్థకు సమాన అవకాశాలు కల్పించాలని, ఇందుకోసం లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ ఉండాలని డిమాండ్ చేశారు. మరోవైపు వివిధ రంగాల్లో పోటీని తగ్గించి గుత్తాధిపత్యాన్ని ప్రోత్సహిస్తోందని కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా విమర్శలు చేశారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలపై ఖర్గే, రాహుల్ గాంధీ శుక్రవారం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

### ఇండియాకు అసలు బాస్ అంబానీనా?

అంతకుముందు భారత చట్టాలు, నిబంధనలు అన్నీ పాటిస్తూ ఐదేళ్లుగా చూస్తున్నా స్టార్‌లింక్‌కు ఇండియాలో లైసెన్స్ రాలేదని, గుత్తాధిపత్యం చెలాయిస్తున్న కొందరు బడా వ్యాపారులు తమకు లైసెన్స్ రాకుండా అడ్డుకుంటున్నారని మస్క్ తెలిపారు. ఇంకా ఇండియాకు అసలు బాస్ అంబానీనా? అని మస్క్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీనికి స్పందించిన రాహుల్ ‘వెల్‌కమ్ టు ఇండియా ఎలాన్. మరో వ్యక్తి గురించి కూడా తెలుసుకునే వరకు వెయిట్ చెయ్’ అని రిప్లై ఇచ్చారు. దీనికి మస్క్ మళ్లీ థ్యాంక్యూ చెప్పి, ఇది చాలా ఆందోళనకర విషయం అన్నారు. ఈ క్రమంలోనే ప్రతి వ్యాపార సంస్థకు ఇండియాలో సమాన అవకాశాలు ఉండాలని రాహుల్ ఓ వీడియోలో తెలిపారు. ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే కూడా ఎక్స్ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. మోదీ ప్రభుత్వ విధానాలు తమకు అనుకూలమైన పెట్టుబడిదారులకే అవకాశం ఇచ్చి ఆర్థిక వ్యవస్థపై నియంత్రణ కలిగి ఉండేలా ఉన్నాయని, దీని ద్వారా బీజేపీ ప్రయోజనాలు పొందుతోందని విమర్శలు గుప్పించారు. మొత్తానికే పోటీని అంతం చేసి గుత్తాధిపత్యం చెలాయిస్తున్న లేదా రెండు ప్రధాన సంస్థల ఆధిపత్యాన్నే ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక వ్యవస్థ పునాదులు దెబ్బతింటున్నాయని ఖర్గే పేర్కొన్నారు. ఈ విధానాన్ని ఆర్థిక ఉగ్రవాదం (ఎకనామిక్ టెర్రరిజం) అని ఆయన అభివర్ణించారు.

### టెలికాం, విమానయాన రంగంలో పోటీనే లేదు: ఖర్గే

తన వాదనకు బలం చేకూర్చేలా ఖర్గే ఉదాహరణలతో వివరించారు. ఇక్కడ టెలికాం, విమానయాన రంగాలను ఆయన ప్రస్తావించారు. 2014కు ముందు టెలికాం రంగంలో ఇండియాలో 13 సంస్థలు ఉండగా, ప్రస్తుతం 3 ప్రైవేట్ సంస్థలే మిగిలాయని ఖర్గే గుర్తు చేశారు. ఇంకా దేశీయ విమానయాన రంగంలో కూడా 2014కు ముందు వరకు 7 ప్రధాన సంస్థలు ఉండేవని, ప్రస్తుతం అక్కడా రెండు ప్రధాన సంస్థలే మిగిలాయని ఆరోపించారు. ఇంకా వీటికి తోడు డిజిటల్ పేమెంట్స్, ఫుడ్ డెలివరీ యాప్స్, సిమెంట్ వంటి రంగాల్లోనూ క్రమంగా పోటీ లేకుండా చేయడమే ప్రభుత్వ ప్రాధాన్యంగా మారిందని ఖర్గే విరుచుకుపడ్డారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు పెద్ద సంఖ్యలో మూతపడుతున్నాయని, యువత నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటోందని అన్నారు. ఇదిలా ఉండగా స్టార్‌లింక్ కమర్షియల్ లైసెన్స్ గురించి మస్క్ చేసిన ఆరోపణలను కేంద్రం తోసిపుచ్చింది. శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలు అందించడానికి దరఖాస్తు చేసుకున్న అన్ని సంస్థలకు తాము సమాన అవకాశాలు కల్పిస్తున్నామని, వివక్ష లేని న్యాయమైన విధానం అమల్లో ఉందన్నారు. ఇక్కడ అవసరమైన భద్రతా పరిశీలనలు, స్పెక్ట్రమ్‌కు సంబంధించిన అనుమతులు పూర్తయ్యే వరకు ఏ సంస్థ కూడా వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించలేదని తెలిపింది. ఈ క్రమంలోనే స్టార్‌లింక్ అనుమతుల అంశం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.



# ఆర్కిటిక్ ఓపెన్‌లో సింధు జోరు!

## క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లిన తెలుగు తేజం

## జపాన్ షట్లర్ రికో గుంజిపై వరుస గేముల్లో విజయం

## తొలి రౌండ్‌లోనే శ్రీకాంత్, తన్వి శర్మకు నిరాశ

ఆర్కిటిక్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ షట్లర్, తెలుగు తేజం పీవీ సింధు సత్తా చాటింది. మహిళల సింగిల్స్‌లో అద్భుత ప్రదర్శనతో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. జపాన్‌కు చెందిన రికో గుంజిపై 21–15, 21–15 తేడాతో వరుస గేముల్లో విజయం సాధించింది. మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన సింధు ప్రత్యర్థికి పుంజుకునే అవకాశం ఇవ్వలేదు. రెండు గేముల్లోనూ ఆధిపత్యం ప్రదర్శించి తదుపరి రౌండ్‌కు అర్హత సాధించింది. మరోవైపు భారత షట్లర్లు కిదాంబి శ్రీకాంత్, యువ క్రీడాకారిణి తన్వి శర్మ తొలి రౌండ్‌లోనే ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించారు.

### శ్రీకాంత్‌కు చుక్కెదురు

పురుషుల సింగిల్స్‌లో తెలుగు షట్లర్ కిదాంబి శ్రీకాంత్‌కు నిరాశ ఎదురైంది. కెనడాకు చెందిన బ్రియాన్ యాంగ్‌తో జరిగిన పోరులో 21–15, 15–21, 13–21 తేడాతో ఓటమిపాలయ్యాడు. తొలి గేమ్‌ను గెలుచుకుని శుభారంభం చేసిన శ్రీకాంత్ ఆ తర్వాత అదే జోరును కొనసాగించలేకపోయాడు. రెండో గేమ్‌లో పుంజుకున్న బ్రియాన్ యాంగ్ నిర్ణయాత్మక మూడో గేమ్‌లోనూ ఆధిపత్యం ప్రదర్శించి విజయాన్ని అందుకున్నాడు.

### తన్వి శర్మ పోరాటానికి తెర

మహిళల సింగిల్స్‌లో యువ సంచలనం తన్వి శర్మ కూడా తొలి రౌండ్‌లోనే ఇంటిబాట పట్టింది. థాయ్‌లాండ్‌కు చెందిన రచనోక్ ఇంతనోన్ చేతిలో 18–21, 7–21 తేడాతో ఓటమి చవిచూసింది. తొలి గేమ్‌లో పోటీనిచ్చిన తన్వి రెండో గేమ్‌లో ప్రత్యర్థి దూకుడును అడ్డుకోలేకపోయింది. దీంతో భారత శిబిరానికి నిరాశ ఎదురైంది. ఈ నేపథ్యంలో క్వార్టర్ ఫైనల్‌కు చేరిన సింధుపైనే భారత అభిమానులు ఆశలు పెట్టుకున్నారు.



# రష్యా దెబ్బకు భారత్ విలవిల!

## మహిళల ఫుట్‌బాల్‌లో భారత జట్టుకు ఘోర పరాజయం

రష్యాతో రెండు స్నేహపూర్వక మ్యాచ్‌ల సిరీస్‌ను భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు ఓటమితో ప్రారంభించింది. గురువారం జరిగిన తొలి పోరులో ప్రపంచ 27వ ర్యాంకర్ రష్యా చేతిలో భారత్ 4--0 గోల్స్ తేడాతో పరాజయం పాలైంది. మ్యాచ్ తొలి అర్ధభాగంలో ప్రత్యర్థికి గట్టి పోటీనిచ్చిన భారత క్రీడాకారిణులు రెండో అర్ధభాగంలో మాత్రం ఆ జోరును కొనసాగించలేకపోయారు. భారత రక్షణ శ్రేణిలో తలెత్తిన లోపాలను సద్వినియోగం చేసుకున్న రష్యా వరుస గోల్స్‌తో ఆధిపత్యం ప్రదర్శించింది. పటిష్ఠమైన రష్యా జట్టును ఎదుర్కొన్న భారత మహిళలు ఆరంభంలో సమర్థంగా పోరాడారు. ప్రత్యర్థి దాడులను అడ్డుకుంటూ మ్యాచ్‌పై పట్టు సాధించేందుకు ప్రయత్నించారు. అయితే రెండో అర్ధభాగంలో రష్యా దూకుడు పెంచడంతో భారత జట్టు ఒత్తిడికి గురైంది. వరుస దాడులతో భారత రక్షణ శ్రేణిని ఛేదించిన రష్యా గోల్స్ సాధించి విజయాన్ని ఖాయం చేసుకుంది. రష్యా విజయానికి పెతుఖోవా కీలకంగా నిలిచింది. రెండు గోల్స్ సాధించి భారత జట్టును దెబ్బతీసింది. రష్యా ఆటగాళ్ల మధ్య సమన్వయం, వేగవంతమైన దాడులు భారత జట్టుకు సవాల్‌గా మారాయి. చివరి వరకు పుంజుకునేందుకు భారత క్రీడాకారిణులు ప్రయత్నించినప్పటికీ గోల్ సాధించలేకపోయారు. దీంతో రష్యా నాలుగు గోల్స్ ఆధిక్యంతో మ్యాచ్‌ను ముగించింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా భారత్, రష్యా జట్లు అక్టోబర్ 11న మరోసారి తలపడనున్నాయి. తొలి మ్యాచ్‌లో ఎదురైన పరాజయం నుంచి పాఠాలు నేర్చుకుని రెండో పోరులో మెరుగైన ప్రదర్శన చేయాలని భారత జట్టు భావిస్తోంది. ముఖ్యంగా రక్షణ విభాగాన్ని పటిష్ఠం చేసుకోవడంతోపాటు గోల్స్ సాధించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం భారత్‌కు కీలకం కానుంది. రెండో మ్యాచ్‌లోనైనా రష్యాకు గట్టి పోటీనిచ్చి సత్తా చాటాలని భారత మహిళల జట్టు లక్ష్యంగా పెట్టుకుంది.

# ఏమి ఆట భయ్యా.. కొట్టుడే కొట్టుడు!

## విండీస్ బౌలర్లకు చుక్కలు చూపించిన భారత బ్యాటర్లు

- రెండో టీ20లో టీమిండియా పరుగుల సునామీ
- 20 ఓవర్లలో 5 వికెట్లకు 249 భారీ స్కోరు
- సిక్సర్ల వర్షం కురిపించిన సంజూ శాంసన్.. 41 బంతుల్లో 82 పరుగులు
- ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ మెరుపు ఇన్నింగ్స్‌లు
- టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న విండీస్‌కు చుక్కెదురు




ఒకరు కొడితే మరొకరు అంతకుమించి బాదేశారు. ఫోర్లతో మొదలుపెట్టి సిక్సర్లతో విరుచుకుపడ్డారు. బంతి ఎక్కడ వేసినా బౌండరీ దాటించడమే లక్ష్యంగా భారత బ్యాటర్లు చెలరేగిపోయారు. వెస్టిండీస్ బౌలర్లకు ఊపిరి సలపనివ్వకుండా పరుగుల వర్షం కురిపించారు. రాంచీలోని జేఎస్‌సీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో టీమిండియా బ్యాటర్లు విధ్వంసం సృష్టించారు. టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్న వెస్టిండీస్ నిర్ణయాన్ని తలకిందులు చేస్తూ భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 249 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ సంజూ శాంసన్ సిక్సర్లతో స్టేడియాన్ని హోరెత్తించగా, ఇషాన్ కిషన్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ మెరుపు బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లను బెంబేలెత్తించారు. బ్యాటర్ల దూకుడుతో రాంచీ స్టేడియం పరుగుల పండుగకు వేదికైంది.

### సంజూ సిక్సర్ల సునామీ!

భారత ఇన్నింగ్స్‌లో సంజూ శాంసన్ బ్యాటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన సంజూ వెస్టిండీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. కేవలం 41 బంతుల్లో నాలుగు ఫోర్లు, తొమ్మిది సిక్సర్లతో 82 పరుగులు సాధించాడు. మైదానం నలుమూలలా భారీ షాట్లు ఆడుతూ ప్రేక్షకులను ఉర్రూతలూగించాడు. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ 20 పరుగులకే వెనుదిరిగినప్పటికీ సంజూ తన జోరును కొనసాగించాడు. బౌలర్లు మారుతున్నా అతడి బ్యాటింగ్ తీరు మాత్రం మారలేదు. బంతిని బౌండరీ దాటించడమే లక్ష్యంగా ఆడిన సంజూ భారత భారీ స్కోరుకు బలమైన పునాది వేశాడు.

### ఇషాన్ కిషన్ మెరుపులు

సంజూ శాంసన్‌కు ఇషాన్ కిషన్ నుంచి అద్భుతమైన సహకారం లభించింది. క్రీజులోకి వచ్చినప్పటి నుంచే దూకుడుగా ఆడిన ఇషాన్ కేవలం 22 బంతుల్లో రెండు ఫోర్లు, ఆరు సిక్సర్లతో 43 పరుగులు సాధించాడు. వెస్టిండీస్ బౌలర్లపై విరుచుకుపడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. సంజూ, ఇషాన్ బ్యాటింగ్ ధాటికి ప్రత్యర్థి జట్టు బౌలింగ్ వ్యూహాలు ఫలించలేదు. వీరిద్దరూ బౌండరీలతో విరుచుకుపడటంతో భారత జట్టు భారీ స్కోరు దిశగా దూసుకెళ్లింది.

### కెప్టెన్ శ్రేయస్ ఊచకోత!

భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా తనదైన శైలిలో చెలరేగిపోయాడు. కేవలం 18 బంతుల్లో ఒక ఫోర్, మూడు సిక్సర్లతో 40 పరుగులు సాధించాడు. తక్కువ బంతుల్లోనే భారీ పరుగులు రాబడుతూ జట్టు స్కోరును మరింత పెంచాడు. వెస్టిండీస్ బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. కీలక సమయంలో కెప్టెన్ ఆడిన మెరుపు ఇన్నింగ్స్ భారత జట్టు భారీ స్కోరు సాధించడంలో ముఖ్యపాత్ర పోషించింది.

### చివర్లో తిలక్ విధ్వంసం!

ఇన్నింగ్స్ చివరి ఓవర్లలో తిలక్ వర్మ బ్యాట్ ఝుళిపించాడు. కేవలం 18 బంతుల్లోనే 44 పరుగులు చేసి భారత స్కోరును మరింత పెంచాడు. చివరి ఓవర్లలో వెస్టిండీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగిన తిలక్ వరుసగా పరుగులు రాబట్టాడు. చివరి బంతికి నమన్ ధీర్ ఫోర్ బాదడంతో భారత ఇన్నింగ్స్ ఘనంగా ముగిసింది. అదనంగా తొమ్మిది పరుగులు రావడంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 249 పరుగులు సాధించింది.

### వికెట్లు తీసినా ఆగని పరుగుల ప్రవాహం

వెస్టిండీస్ బౌలర్లలో రోస్టన్ చేజ్ మూడు వికెట్లు పడగొట్టగా, షామర్ స్ప్రింగర్ రెండు వికెట్లు సాధించాడు. అయినప్పటికీ భారత బ్యాటర్ల పరుగుల ప్రవాహాన్ని అడ్డుకోలేకపోయారు. ఒక బ్యాటర్ ఔటైనా మరో బ్యాటర్ అదే దూకుడును కొనసాగించడంతో వెస్టిండీస్ బౌలర్లకు ఊరట లభించలేదు. భారీ స్కోరుతో ప్రత్యర్థికి టీమిండియా సవాల్ విసిరింది. విజయానికి వెస్టిండీస్ 250 పరుగులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# టోర్నీకి ముందే పాక్ ఔట్!

- ఆసియా ఛాంపియన్స్ హాకీ ట్రోఫీ నుంచి పాకిస్థాన్ వైదొలగినట్లు కథనం
- తటస్థ వేదికపై మ్యాచ్ నిర్వహించాలన్న పాక్ హాకీ సమాఖ్య
- హైబ్రిడ్ విధానానికి అంగీకరించని నిర్వాహకులు
- అక్టోబర్ 27న జరగాల్సిన భారత్--పాక్ పోరుకు అడ్డంకి
- పాకిస్థాన్ స్థానంలో బంగ్లాదేశ్‌కు అవకాశం లభించినట్లు సమాచారం
- పంజాబ్‌లోని జలంధర్, మొహాలీ వేదికలుగా పోటీలు



ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ పురుషుల హాకీ టోర్నమెంట్ ప్రారంభానికి ముందే పాకిస్థాన్ జట్టు పోటీ నుంచి తప్పుకుంది. భారత్‌లో జరిగే టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు తటస్థ వేదిక ఏర్పాటు చేయాలన్న తమ ప్రతిపాదనను నిర్వాహకులు తిరస్కరించడంతో పాకిస్థాన్ హాకీ సమాఖ్య ఈ నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 27 నుంచి నవంబర్ 5 వరకు పంజాబ్‌లోని జలంధర్, మొహాలీ నగరాల్లో జరగనున్న ఈ ప్రతిష్ఠాత్మక పోటీల్లో పాకిస్థాన్ స్థానంలో బంగ్లాదేశ్‌కు అవకాశం కల్పించారు. ఈ మేరకు ఆసియా హాకీ సమాఖ్య శుక్రవారం సవరించిన మ్యాచ్‌ల షెడ్యూల్‌ను ప్రకటించింది. దీంతో హాకీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత్–పాకిస్థాన్ పోరుకు తెరపడింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత జట్టు ఇప్పుడు బంగ్లాదేశ్‌తో తన తొలి మ్యాచ్ ఆడనుంది.

### తటస్థ వేదికపై పాక్ పట్టు

భారత్, పాకిస్థాన్ మధ్య కొనసాగుతున్న రాజకీయ, దౌత్యపరమైన ఉద్రిక్తతల నేపథ్యంలో తమ జట్టును భారత్‌కు పంపడం సాధ్యం కాదని పాకిస్థాన్ హాకీ సమాఖ్య పేర్కొంది. ఆటగాళ్లు, అధికారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని టోర్నమెంట్‌ను మరో దేశానికి తరలించాలని లేదా కనీసం పాకిస్థాన్ ఆడే మ్యాచ్‌లను తటస్థ వేదికపై నిర్వహించాలని ఆసియా హాకీ సమాఖ్యను కోరింది. సెప్టెంబర్ 16న ఈ మేరకు అధికారికంగా ప్రతిపాదన పంపింది. అయితే ముందుగా నిర్ణయించిన వేదికల్లోనే పోటీలు జరుగుతాయని హాకీ ఇండియా, ఆసియా హాకీ సమాఖ్య స్పష్టం చేశాయి. పాకిస్థాన్ ప్రతిపాదనను అంగీకరించకపోవడంతో టోర్నమెంట్ నుంచి వైదొలుగుతున్నట్లు ఆ దేశ హాకీ సమాఖ్య ప్రకటించింది.



### పాక్ స్థానంలో బంగ్లాదేశ్‌కు అవకాశం

పాకిస్థాన్ తప్పుకోవడంతో ఖాళీ అయిన స్థానాన్ని బంగ్లాదేశ్‌తో భర్తీ చేశారు. తొలుత బంగ్లాదేశ్, ఒమన్ జట్లను ప్రత్యామ్నాయ జట్లుగా గుర్తించిన ఆసియా హాకీ సమాఖ్య, పాక్ నిర్ణయం అనంతరం బంగ్లాదేశ్‌కు ఆహ్వానం పంపింది. ఆ దేశ హాకీ సమాఖ్య అంగీకరించడంతో సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేసింది. తాజా షెడ్యూల్ ప్రకారం భారత్, బంగ్లాదేశ్, చైనా, జపాన్, మలేషియా, దక్షిణకొరియా జట్లు టోర్నమెంట్‌లో పాల్గొననున్నాయి. ఆరు జట్లు లీగ్ దశలో ఒక్కో ప్రత్యర్థితో తలపడతాయి. అత్యధిక పాయింట్లు సాధించిన నాలుగు జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి.

### అక్టోబర్ 27న బంగ్లాదేశ్‌తో భారత్ తొలి పోరు

సవరించిన షెడ్యూల్ ప్రకారం భారత జట్టు అక్టోబర్ 27న బంగ్లాదేశ్‌తో తన తొలి మ్యాచ్ ఆడనుంది. అనంతరం అక్టోబర్ 29న చైనా, 30న జపాన్, నవంబర్ 1న మలేషియా, నవంబర్ 2న దక్షిణకొరియాతో తలపడుతుంది. భారత జట్టు లీగ్ మ్యాచ్‌లన్నీ సాయంత్రం ఏడు గంటలకు ప్రారంభమవుతాయి. తొలుత నవంబర్ 1న జరగాల్సిన భారత్–పాకిస్థాన్ మ్యాచ్ స్థానంలో భారత్–మలేషియా పోరును నిర్వహించనున్నారు. దీంతో దాయాదుల మధ్య మరో ఆసక్తికర హాకీ సమరాన్ని చూడాలనుకున్న అభిమానులకు నిరాశ ఎదురైంది.

### రెండు నగరాల్లో హాకీ సందడి

పంజాబ్‌లోని జలంధర్, మొహాలీ నగరాలు ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యం ఇవ్వనున్నాయి. జలంధర్‌లోని ఒలింపియన్ సుర్జిత్ సింగ్ హాకీ స్టేడియంలో అక్టోబర్ 27 నుంచి నవంబర్ 2 వరకు లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కూడా అక్కడే నిర్వహించనున్నారు. అనంతరం పోటీలు మొహాలీలోని ఒలింపియన్ బల్బీర్ సింగ్ సీనియర్ అంతర్జాతీయ హాకీ స్టేడియానికి మారనున్నాయి. నవంబర్ 4న సెమీఫైనల్స్, నవంబర్ 5న కాంస్య పతక పోరు, ఫైనల్ నిర్వహించనున్నారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత పంజాబ్‌లో పెద్ద అంతర్జాతీయ హాకీ టోర్నమెంట్ జరగనుండటంతో ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.

### మరో టైటిల్‌పై భారత్ గురి

ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత జట్టు మరోసారి టైటిల్‌ను దక్కించుకోవడమే లక్ష్యంగా సిద్ధమవుతోంది. ఇటీవల జపాన్‌లో జరిగిన ఆసియా క్రీడల్లో మలేషియాను ఓడించి స్వర్ణ పతకం సాధించిన హర్మన్‌ప్రీత్ సింగ్ సేన మంచి ఆత్మవిశ్వాసంతో ఉంది. ఆసియా క్రీడల సెమీఫైనల్లో పాకిస్థాన్‌ను 4–3 గోల్స్ తేడాతో ఓడించిన భారత్, ఫైనల్లో మలేషియాపై 5–1తో విజయం సాధించింది. అదే జోరును స్వదేశంలో జరిగే ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలోనూ కొనసాగించాలని భావిస్తోంది. పాకిస్థాన్ వైదొలగడంతో టోర్నమెంట్ సమీకరణాలు మారినప్పటికీ మిగిలిన ఐదు జట్ల నుంచి భారత్‌కు గట్టి పోటీ ఎదురయ్యే అవకాశం ఉంది.

RNI:APTEL/2023/87729
పెన్ సత్తా
ప్రశ్నించడం అందరి హక్కు...
PEN SATTA Telugu Daily


## సంపాదకీయం

# సంయమనమే సమాధానం!

దేశవ్యాప్తంగా జరిగిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర పునఃసమీక్షలో జరిగిన అక్రమాలని ఆరోపిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ సాగుతున్న ఆందోళన, అక్టోబర్ 10న కొత్త దశలోకి అడుగుపెడుతోంది. 'కాక్రోచ్ జనతా పార్టీ'తోపాటు పలు విద్యార్థి సంఘాలు నేడు జంతర్ మంతర్ వద్ద ఇప్పటికే సాగుతున్న నిరసనల్లో చేరనున్నాయి. "సీఈసీ రాజీనామా చేయకపోతే దేశం నలుమూలల నుంచీ వచ్చి ఢిల్లీలో నిరసన తెలుపుతాం, పోలీసులు ఆపితే ఎక్కడ ఆపితే అదే మా జంతర్ మంతర్ అవుతుంది, ఇది శాంతియుత ఆందోళన" అని సీజేపీ ఇప్పటికే ప్రకటించింది. ఈ ఆందోళన శాంతియుతంగా సాగడం అందరి ప్రయోజనం. నిరసనకారులు, ప్రభుత్వం, ముఖ్యంగా ఢిల్లీ పోలీసులు వివేకంతో, సంయమనంతో వ్యవహరించాలి. శాంతియుతంగా సమావేశమయ్యే హక్కును రాజ్యాంగం గుర్తిస్తుంది, ఈ విషయాన్ని రెండు పక్షాలూ గౌరవించాలి. ఎస్ఐఆర్‌లో ఎలాంటి తప్పు లేకుండా జాబితాల నుంచి తొలగించబడ్డ ప్రజల కోసం న్యాయం కోరే ఈ గళం శాంతియుతంగా వినిపించేలా చూడాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉంది. లక్ష్యమెంత ముఖ్యమో, అక్కడికి చేరే మార్గమూ అంతే, కొన్నిసార్లు అంతకంటే ఎక్కువ ముఖ్యం కూడా. ప్రస్తుత ఆందోళనకు ఉన్న కారణం నిజమైనది, సద్భావనతో కూడినది. ఒకరిద్దరు అల్లరిమూకల వల్ల అది పట్టాలు తప్పకుండా చూసుకోవాలి. ఎన్నికల సంఘం ఈ ఫిర్యాదుల్లో కొన్నింటిని పరోక్షంగా అంగీకరించి, తొలగించబడిన అర్హులైన ఓటర్లను చేర్చేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. అయితే ఇది సరిపోదని, 'అకౌంటబిలిటీ' ముఖ్యమన్నది నిరసనకారుల డిమాండ్. 'సర్'లో ఎలాంటి అక్రమాలూ జరగలేదని, ప్రక్రియ నిబంధనల ప్రకారమే సాగిందని ఎన్నికల సంఘం, అధికార పక్షం వాదిస్తున్నాయి. ఈ వాదనల మధ్య నిజానిజాలను తేల్చాల్సింది సుప్రీంకోర్టువంటి రాజ్యాంగ సంస్థలే!

ఈ ఆందోళనకు వాతావరణాన్ని కొంత ఉద్రిక్తం చేస్తున్నది, పోలీసుల ప్రవర్తనపై ఇప్పటికే వచ్చిన ఆరోపణలు. ఈ ఏడాది జులై 20న పరీక్షా పేపర్ల లీకేజీలకు వ్యతిరేకంగా, నీట్-యూజీ సహా పోటీ పరీక్షల అక్రమాలపై సాగిన దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా 'ఛలో సంసద్' పేరుతో విద్యార్థులు మార్చ్ చేశారు. ఆ సందర్భంగా పోలీసులు అధిక బలప్రయోగం చేశారని, కనీసం 60మంది నిరసనకారులు గాయపడ్డారని, లింగ ఆధారిత హింస ఆరోపణలు వచ్చాయని పిటిషన్లు పేర్కొన్నాయి, వీటిపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అప్పటి కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వ్యతిరేకంగా సాగిన ఆ నిరసనలో, పోలీసులు చాలామంది యువకులను, వారిలో టీనేజర్లనూ, ఊహించని విధంగా ఎదుర్కొన్న తీరు ప్రశ్నార్థకమైంది. ఈ ఘటన ప్రజల్లో ఎంత ఆగ్రహాన్ని రేకెత్తించిందంటే, సుప్రీంకోర్టు స్వయంగా జోక్యం చేసుకుని, ఒక మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేయాల్సి వచ్చిందని కొన్ని విశ్లేషణలు పేర్కొన్నాయి. ఈ తాజా నిరసనల్లోనూ పోలీసుల ప్రవర్తనపై విశ్వాసం కలిగించే పరిస్థితి కనిపించడం లేదు. అక్టోబర్ 3న జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలో, విద్యార్థి నాయకురాలి నిర్బంధాన్ని చిత్రీకరిస్తున్న ఒక మహిళా జర్నలిస్టు, ఒక సీనియర్ పోలీసు అధికారి తనను అసభ్యంగా తాకి, నెట్టేశారని ఆరోపించారు. ఆమెతోపాటు మరో ఇద్దరు మహిళా జర్నలిస్టులూ లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు. ఫిర్యాదు చేయడానికి పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా గంటల తరబడి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. జర్నలిస్టులు, నిరసనకారులు, న్యాయవాదులు ఆ స్టేషన్ ముందు గుమిగూడి డిమాండ్ చేసిన తర్వాతే, ఢిల్లీ పోలీసులు ఆ ఫిర్యాదులను "న్యాయమైన, నిష్పాక్షిక విచారణ" కోసం క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేసినట్టు ప్రకటించారు. గతంలో, ముఖ్యంగా 2023 రెజ్లర్ల నిరసనలో, సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్న తర్వాతే ఎఫ్ఐఆర్‌లు నమోదైన విషయాన్నీ ఇక్కడ గుర్తుచేసుకోవాలి. అదే విధంగా, పోలీసులు నేమ్‌ప్లేట్లు తొలగించుకుని ఉండటం, యూనిఫారం లేని వ్యక్తులు పోలీసులతో కలిసి పనిచేసినట్టు కనిపించే దృశ్యాలు ఉండటం వంటి ఆరోపణలు, అంగీకారయోగ్యం కావు. అత్యంత ఉద్వేగంతో ఉన్న విద్యార్థులు, యువతను నియంత్రించడం పోలీసులకు కఠినమైన పని అన్నది నిజమే, అది వారి సహనాన్ని పరీక్షించవచ్చు. కానీ అందుకోసం వారు తమ సొంత వృత్తి నైపుణ్యంపై ఆధారపడాలి తప్ప, కిరాయి గూండాలపై కాదు. యూనిఫారంలో ఉన్న ప్రతి ఒక్కరికీ చట్టప్రకారమే నడుచుకోవాలని స్పష్టంగా చెప్పాల్సిన బాధ్యత పోలీసు నాయకత్వంపై ఉంది. ఇదే సమయంలో, కొందరు మితవాద కార్యకర్తలు జంతర్ మంతర్‌వైపు కదులుతున్నారన్న నివేదికలు ఆందోళనకు కారణమవుతున్నాయి. నిరసనకారులపై ఏ పక్షం నుంచి వచ్చే హింసనైనా సమానంగా అడ్డుకోవడం ప్రభుత్వ బాధ్యత. నిరసనకారులు కూడా ఇదే బాధ్యతను పంచుకోవాలి: ఎవరు రెచ్చగొట్టినా ప్రతిస్పందించకుండా శాంతిని పాటించడం, అల్లర్లకు ఆస్కారం ఇవ్వకపోవడం. చట్టబద్ధమైన నిబంధనలు, అనుమతులను గౌరవిస్తూనే తమ గళం వినిపించడం వల్ల వారి వాదనకు నైతిక బలం పెరుగుతుంది. ఆ బలాన్ని కాపాడుకోవాలంటే, ఏ చిన్న హింసాత్మక ఘటననూ సమర్థించకుండా, వెంటనే ఖండించే పరిణతి చూపాలి. ప్రతిపక్షం కూడా పోలీసు చర్యలపై ఆరోపణలు చేయడమే కాక, నిరసనల సమయంలో తలెత్తే ఏ హింసనైనా సమానంగా ఖండించాలి. ఇటీవల ఢిల్లీలో విద్యార్థి ఆందోళనల సమయంలో కొన్ని అవాంఛనీయ శక్తులు చేరడంతో, హింస చెలరేగి సామాన్యులు, పోలీసులు గాయపడ్డారని, ప్రధానమంత్రిపై అభ్యంతరకర భాష వాడారని వచ్చిన విమర్శలను ఉదాహరణగా చూపుతున్నారు. ఇలాంటివి నిజమైన ఉద్యమం విశ్వసనీయతను దెబ్బతీస్తాయి. ప్రభుత్వం, తన వైపునుంచి, ప్రజాస్వామ్య శక్తిని నమ్మి, నిరసనకారులతో చర్చలు జరపాలి. ఇది కొత్త ఆలోచన కాదు, ప్రధాని నరేంద్ర మోదీ అంతర్జాతీయ వేదికలపై ఇతర దేశాలకు ఇచ్చే సలహా కూడా ఇదే. ప్రజాస్వామ్యానికి సమస్యలను ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించే శక్తి ఉంది, రెండు పక్షాలూ ఆ విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఎన్నికల సంఘం తనపై వచ్చిన అనుమానాలను నివృత్తి చేసేందుకు పారదర్శకంగా వివరణ ఇవ్వడం, సుప్రీంకోర్టు ఎస్ఐఆర్‌పై తన తీర్పును త్వరగా వెలువరించడం, పోలీసులు జర్నలిస్టుల ఫిర్యాదులపై నిష్పాక్షిక విచారణ జరపడం, ఇవన్నీ ఈ ఉద్రిక్తతను తగ్గించగల మార్గాలు. నిరసన హక్కుతోపాటు శాంతిభద్రతలను సమతుల్యం చేసినప్పుడే, జంతర్ మంతర్ వద్ద జరిగే పరీక్షలో ప్రజాస్వామ్యం గెలుస్తుంది!

## పనికొచ్చే పలుకు



# మీ మైండ్.. అప్‌గ్రేడ్ అవుతోందా!?

ఫోన్‌కు కొత్త అప్‌డేట్ వచ్చినప్పుడు, బయటికి పెద్ద మార్పేమీ కనిపించదు. కానీ లోపల సిస్టమ్ స్మూత్‌గా పనిచేస్తుంది, బ్యాటరీ ఎక్కువసేపు నిలుస్తుంది, ల్యాగ్ తగ్గుతుంది. మన ఆలోచనా విధానమూ అంతే. అది మెరుగవుతున్నప్పుడు ఒక్కసారిగా బ్యానర్లు పెట్టి చెప్పదు, కొన్ని చిన్న చిన్న అలవాట్ల రూపంలో బయటపడుతుంది.

**బోరింగ్ టైమ్‌ను ఆస్వాదించడం:** క్యూలో నిలబడినప్పుడో, బస్సు కోసం చూస్తున్నప్పుడో.. వెంటనే ఫోన్ తీస్తాం. నిమిషం ఖాళీగా ఉండటం కూడా భరించలేనిదిగా అనిపిస్తుంది. కానీ మెదడుకు ఈ ఖాళీ క్షణాలే రీఛార్జ్ పాయింట్లు. ఏ పనీ లేనప్పుడు మనసు తనలో తాను ఆలోచించుకుంటుంది, కొత్త ఐడియాలు పుడతాయి, పాత గందరగోళం సర్దుకుంటుంది. అందుకే "బోర్ కొడుతోంది" అనే ఫీలింగ్‌ను భయపడకుండా భరించగలిగేవారి మైండ్ క్రియేటివ్‌గా ఉంటుందట.

**పనికిరాని వాదనలకు దూరంగా ఉండటం:** సోషల్ మీడియాలో ఎవరో ఏదో అన్నారని, కామెంట్ సెక్షన్‌లో గంటల తరబడి గొడవపడ్డారా? దాని ఫలితమేంటి? ఎవరూ మారలేదు, మీ ఎనర్జీ మాత్రం పోయింది. పరిణతి చెందిన మైండ్ ఎప్పుడు మాట్లాడాలో, ఎప్పుడు వదిలేయాలో తెలుసుకుంటుంది. ప్రతి వాదనా గెలవాల్సిన యుద్ధం కాదు. "ఇది నా సమయానికి విలువైనదేనా?" అని ఆలోచిస్తే.. జవాబు దొరుకుతుంది.

**పుస్తకాలను ప్రేమించడం:** రీల్స్ ముప్పై సెకన్ల కిక్ ఇస్తాయి. పుస్తకం మాత్రం మనసుకు లోతైన ఆలోచనిస్తుంది. పుస్తకాన్ని ఓపికగా చదవడం అంటే, ఒక మనిషి ఆలోచనలో కొన్ని గంటలు గడపడం. దాంతో మీ ఫోకస్, ఊహాశక్తి, భాషపై పట్టు పెరుగుతాయి. రోజుకు కేవలం ఇరవై పేజీలు చదివినా, ఏడాదికి ఎన్నో పుస్తకాలు పూర్తవుతాయి. పుస్తక ప్రేమ అనేది, మీ మైండ్ "షార్ట్ కంటెంట్" నుంచి "డీప్ థింకింగ్" వైపు మళ్లుతోందనడానికి గొప్ప సూచిక.

**నిశ్శబ్దాన్ని ఇష్టపడటం:** ఇయర్‌ఫోన్లు, నోటిఫికేషన్లు, నేపథ్య సంగీతం – మన చుట్టూ శబ్దం ఎప్పుడూ ఉంటుంది. కానీ కొన్నిసార్లు ఏ శబ్దమూ లేకుండా కూర్చోవడం, మన నిజమైన ఆలోచనలను వినడానికి ఒక అవకాశం. నిశ్శబ్దంలో సౌకర్యంగా ఉండగలగడం అంటే, మీతో మీరు స్నేహంగా ఉన్నారని. అలాంటివారు ఇతరుల ఆమోదం కోసం వెంపర్లాడరు, నిర్ణయాలను స్పష్టంగా తీసుకోగలరు.

**తప్పులను స్వచ్ఛందంగా అంగీకరించడం:** "సారీ, నా తప్పే" అని చెప్పడం బలహీనత కాదు, అది అత్యంత ధైర్యమైన పని. తప్పును దాచుకోవడానికి, సాకులు వెతకడానికి చాలా శక్తి ఖర్చవుతుంది. కానీ దాన్ని అంగీకరిస్తే, ఆ బరువు వెంటనే తగ్గిపోతుంది, పైగా ఎదుటివారికి మీపై నమ్మకం పెరుగుతుంది. తప్పును ఒప్పుకునేవారే, దాన్నుంచి నేర్చుకొని మళ్లీ పునరావృతం కాకుండా చూసుకోగలరు.

ఈ ఐదు అలవాట్లు కలిసి మీ రోజువారీ జీవితాన్ని తేలిక చేస్తాయి. ఒత్తిడి తగ్గుతుంది, ఎందుకంటే మీరు అనవసర గొడవల్లో, నిరంతర శబ్దంలో, తప్పులను దాచే ప్రయత్నాల్లో తలమునకలు కారు. ఏకాగ్రత పెరుగుతుంది, ఎందుకంటే పుస్తకాలు, నిశ్శబ్దం మీ మెదడును లోతుగా ఆలోచించేలా తీర్చిదిద్దుతాయి. సంబంధాలు మెరుగవుతాయి, ఎందుకంటే మీరు క్షమాపణ చెప్పగలరు, వాదనలను వదిలేయగలరు. నిర్ణయాలు స్పష్టంగా ఉంటాయి. కారణం –మనసు ప్రశాంతంగా ఉంది. అన్నింటినీ ఒకేసారి మార్చాల్సిన అవసరం లేదు. ఈ వారం ఒక్కటే ఎంచుకోండి: ఉదాహరణకు, రోజులో పది నిమిషాలు ఫోన్ లేకుండా కూర్చోండి. లేదా నిద్రకు ముందు ఐదు పేజీలు చదవండి. లేదా తదుపరిసారి మీరు తప్పు చేసినప్పుడు, వెంటనే "నా తప్పే" అని చెప్పండి. ఒక్క అలవాటు నిలబడితే, మిగతావి నెమ్మదిగా అవే వస్తాయి. తెలివి అంటే ఎక్కువ మాట్లాడటం, వాదించడం కాదు. ఖాళీని భరించగలగడం, నిశ్శబ్దంలో ఆలోచించగలగడం, తప్పును ఒప్పుకోగలగడం. అప్పుడే.. మైండ్ సరైన దిశలోనే అప్‌గ్రేడ్ అవుతున్నట్టు!!

# ప్రజా ఉద్యమానికి సంకేతమా?



ఈ ఏడాది మే నెలలో ఒక సుప్రీంకోర్టు విచారణలో, నకిలీ డిగ్రీలపై చర్చ సందర్భంగా నిరుద్యోగ యువతను బొద్దింకలతో పోల్చినట్టుగా వచ్చిన మాట తీవ్ర వివాదానికి దారితీసింది. అది నకిలీ డిగ్రీదారులను ఉద్దేశించి అన్నదే తప్ప దేశ యువతను కాదని ప్రధాన న్యాయమూర్తి తర్వాత స్పష్టం చేశారు. కానీ ఆ రోజే, రాజకీయ వ్యూహకర్త అభిజీత్ దిప్కే ఆ అవమానాన్ని ఒక పతాకంగా మార్చి, 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) అనే వ్యంగ్య ఉద్యమాన్ని ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. అధికార భారతీయ జనతా పార్టీ పేరుకు పేరడీగా పెట్టిన ఈ పేరు, సామాజిక మాధ్యమాల్లో వేగంగా విస్తరించింది. ఇది ఎన్నికల సంఘం వద్ద నమోదైన రాజకీయ పార్టీ కాదు, ఇది ఒక యువ ఉద్యమం. పేపర్ లీకేజీలు, నిరుద్యోగం వంటి యువత సమస్యలతో మొదలైన ఈ ఉద్యమం, అప్పటి కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసింది, ఇది దాని తొలి పెద్ద విజయంగా పరిగణించబడింది. ఆ తర్వాత పరీక్షలు, పాఠశాలలు వంటి విద్యా రంగ అంశాలపై 'ఠీక్ కరో' (సరిదిద్దండి) అనే ప్రచార శ్రేణి సాగింది. ఇప్పుడు అకస్మాత్తుగా 'ఎలక్షన్ కమిషన్ ఠీక్ కరో' అంటూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్ చేస్తూ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర పునఃసమీక్ష (ఎస్ఐఆర్)పై ఉద్యమాన్ని మొదలుపెట్టింది. ఒకవైపు ప్రతిపక్ష పార్టీలు ఇదే అంశంపై పోరాడుతుండగా, అక్టోబర్ 10న జంతర్ మంతర్ వద్ద భారీ నిరసనకు సీజేపీ సిద్ధమైంది. ఈ మార్పును రెండు రకాలుగా చూస్తున్నారు. ప్రజా ఉద్యమాల లక్షణమే ఇది: ఒక్క సమస్యతో మొదలై క్రమంగా విస్తృత ఉద్యమంగా మారుతాయని కొందరు వాదిస్తారు. సీజేపీ నేతలకు రాజకీయ ఆకాంక్షలున్నాయని, అందుకే ఉద్యమాన్ని విద్యా పరిధి నుంచి రాజకీయ రంగంలోకి ఉద్దేశపూర్వకంగా తీసుకెళ్తున్నారని, ఢిల్లీలో ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం ఉన్నా, దిప్కే స్వరాష్ట్రం కావడంతోనే ముంబయిలో పోరాటం ప్రారంభించారని మరికొందరి వాదన. దీనివల్ల యువత సమస్యలనే అసలు లక్ష్యం దెబ్బతిని, ఉద్యమానికే నష్టం జరుగుతుందన్నది ఇంకొక వాదన. ఏది నిజమో భవిష్యత్తే చెప్పాలి!

ఈ ప్రశ్నను అర్థం చేసుకోవడానికి చరిత్రను చూడాలి. భారత చరిత్రలో ఇలాంటి ఉద్యమాలు ఒక చిన్న సమస్యతో మొదలై, దేశ రాజకీయాలనే మార్చిన ఉదాహరణలు ఉన్నాయి. 1973 డిసెంబర్‌లో అహ్మదాబాద్‌లోని ఒక ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్ మెస్ ఫీజుల పెంపును వ్యతిరేకిస్తూ విద్యార్థులు మొదలుపెట్టిన నిరసన, ప్రభుత్వ అణచివేత చర్యలతో ఉధృతమై, ఇతర విశ్వవిద్యాలయాల విద్యార్థులు, కార్మికులు, సామాన్య ప్రజలూ చేరడంతో, 1974 ఫిబ్రవరిలో సీఎం చిమన్‌భాయ్ పటేల్ ప్రభుత్వ పతనానికి దారితీసింది. అదే 'గుజరాత్ నవనిర్మాణ్ ఉద్యమం', దానిలో ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ సైతం యువ కార్యకర్తగా పాల్గొన్నట్టు చెబుతారు. అదే ఏడాది బీహార్‌లో ఉద్యోగాలు, ధరల పెరుగుదల, అవినీతిపై విద్యార్థులు మొదలుపెట్టిన ఆందోళనకు జయప్రకాష్ నారాయణ్ నాయకత్వం వహించి, 'సంపూర్ణ క్రాంతి' పిలుపునిచ్చారు. ఆ ఉద్యమం ఎమర్జెన్సీ విధింపునకు, ఆ తర్వాత 1977లో కాంగ్రెస్ ఓటమికి, జనతా పార్టీ ప్రయోగానికి దారితీసింది. ఆనాటి ప్రధాన అంశాలైన నిరుద్యోగం, ధరల పెరుగుదల, అవినీతి, రాజకీయ జవాబుదారీతనం ఈనాటికీ ప్రధాన సామాజిక-ఆర్థిక సవాళ్లుగానే ఉన్నాయి. అందుకే, అమెరికా మేధో సంస్థ 'కౌన్సిల్ ఆన్ ఫారిన్ రిలేషన్స్' కూడా సీజేపీని నేపాల్, బంగ్లాదేశ్‌లతో పోల్చడంకంటే, భారతదేశపు 1970ల ఉద్యమాలతో పోల్చడమే సమంజసమని సూచించింది. అయితే సామ్యాలతో పాటు తేడాలూ ఉన్నాయి. నేపాల్‌లో 2025 సెప్టెంబర్‌లో 26 సామాజిక మాధ్యమ వేదికలపై నిషేధంతో మొదలైన 'జెన్ జీ' ఆందోళన, ప్రభుత్వాన్ని కూల్చి, పార్లమెంట్, సుప్రీంకోర్టు భవనాలకు నిప్పుపెట్టే వరకూ వెళ్లింది. బంగ్లాదేశ్‌లో 2024లో విద్యార్థుల ఉద్యమం ప్రభుత్వ క్రూరమైన అణచివేతతో మరింత ఉధృతమై, షేక్ హసీనా పతనానికి దారితీసింది. శ్రీలంకలో 2022లో ఆర్థిక పతనం 'అరగలయ' ఉద్యమానికి కారణమైంది. ఈ దేశాల్లో అధికార, ఆర్థిక, సాంకేతిక శక్తి ఒక్క నగరంలో కేంద్రీకృతమై ఉండగా, భారత్‌లో అది వివిధ నగరాలు, రాష్ట్రాలకు విస్తరించి ఉందని విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు, అందువల్ల ఒక్క రాజధానిలో జరిగే ఆందోళన పాలనను స్తంభింపజేయడం కష్టం. 1970ల ఉద్యమాలకు జయప్రకాష్ నారాయణ్ వంటి నైతిక అధికారం ఉన్న నాయకుడు, ప్రతిపక్ష పార్టీల, సంఘాల సంస్థాగత బలం ఉండేవి. సీజేపీ ప్రధానంగా డిజిటల్ వేదికపై పుట్టిన, వ్యంగ్యంతో కూడిన, నాయకత్వ నిర్మాణం ఇంకా పటిష్టం కాని ఉద్యమం. జూన్‌లో కొందరు నిపుణులు, ఈ ఉద్యమం విద్యా మంత్రి రాజీనామా డిమాండ్‌కే పరిమితమైందని, ఇది నేపాల్, బంగ్లాదేశ్ స్థాయికి ఎదిగే అవకాశం తక్కువని అభిప్రాయపడ్డారు, అప్పటి ఒక నిరసనకు ఉత్సాహభరిత స్పందన రాలేదనీ గుర్తుచేశారు. కానీ అప్పటి నుంచి పరిస్థితి మారింది. విద్యా మంత్రి రాజీనామా విజయం ఉద్యమానికి ఆత్మవిశ్వాసాన్నిచ్చింది, ఇప్పుడు ఎంచుకున్న అంశం, అంటే ఓటర్ల జాబితా నుంచి తొలగింపులు, కేవలం యువతకే కాక, ప్రతి ఓటరునూ తాకుతుంది. అరుంధతీ రాయ్ వంటి రచయితలు, ఈ ఉద్యమం దేశవ్యాప్త అశాంతి విస్తృత తరంగంలో భాగమని కూడా వ్యాఖ్యానించారు.

కాబట్టి, ఇది "ప్రజా తిరుగుబాటు"కు సంకేతమా? ఇప్పటికి ఇది తిరుగుబాటు కాదు, కానీ దాన్ని కేవలం ఒక ఇంటర్నెట్ సంచలనంగా కొట్టిపారేయడం కూడా సరికాదు. ఇది దేశంలోని యువతలో పెరుగుతున్న అసంతృప్తికి, వ్యవస్థల పట్ల తగ్గుతున్న నమ్మకానికి స్పష్టమైన హెచ్చరిక. ఈ ఉద్యమం నిజమైన ప్రజా ఉద్యమంగా ఎదగాలంటే కొన్ని పరీక్షలు నెగ్గాలి: ఢిల్లీ దాటి రాష్ట్రాలకు, చిన్న పట్టణాలకు విస్తరించే నిలకడైన ప్రజా మద్దతు, వివిధ వర్గాల భాగస్వామ్యం, శాశ్వత సంస్థాగత నిర్మాణం, తమను తమలో కలిపేసుకోవాలని చూసే రాజకీయ పార్టీల నుంచి స్వతంత్రత, అన్నింటికీ మించి అహింస. ప్రతిపక్షాలు ఇప్పటికే ఇదే అంశంపై పోరాడుతున్నాయి, వాటి మధ్య సీజేపీ తన ప్రత్యేక గుర్తింపును కాపాడుకోగలదా? అన్నది కీలకం. యువత సమస్యలనుంచి ఎన్నికల రాజకీయాల వైపు మళ్లడం వల్ల ఉద్యమం బలహీనపడే ప్రమాదాన్నీ విస్మరించకూడదు. పొరుగు దేశాల అనుభవం ఇందుకు హెచ్చరిక: బంగ్లాదేశ్‌లో 'జెన్ జీ' విప్లవం తర్వాత జరిగిన ఎన్నికల్లో పాత రాజకీయ శక్తులే ఆధిపత్యం చెలాయించగా, విద్యార్థులు స్థాపించిన కొత్త పార్టీ పట్టు సాధించడానికి కష్టపడింది; నేపాల్‌లో ఉద్యమం తర్వాత 120కి పైగా పార్టీలు ఎన్నికల బరిలో నిలిచాయి. వీధి ఉద్యమాలు ఎన్నికల రాజకీయాల్లో నిలదొక్కుకోవడం అంత సులువు కాదని ఇవి చెబుతున్నాయి. చివరగా, ప్రభుత్వ స్పందన ఎంత కీలకమో 1970ల చరిత్ర, నేపాల్, బంగ్లాదేశ్ అనుభవాలు రెండూ చెబుతున్నాయి. అణచివేత, నిర్లక్ష్యం, అహంకారం ఉద్యమాలను చల్లార్చవు, మరింత రాజేస్తాయి. చర్చలు, పారదర్శకత, నిష్పాక్షిక విచారణలు వాటిని శాంతియుత మార్గంలో నడిపిస్తాయి. ఎన్నికల సంఘం తనపై వచ్చిన అనుమానాలను నివృత్తి చేయకుండా, ప్రభుత్వం ఆందోళనను శాంతిభద్రతల సమస్యగా మాత్రమే చూస్తే, ఉద్యమానికి కావాల్సిన ఇంధనాన్ని అదే అందించినట్టవుతుంది. ఈ ప్రశ్నకు సమాధానం నిరసనకారుల చేతుల్లోనే కాదు, పాలకుల చేతుల్లోనూ ఉంది. ఇది తిరుగుబాటుగా మారుతుందా, లేక వ్యవస్థను సంస్కరించే ఒత్తిడిగా మిగులుతుందా? అన్నది, రెండు పక్షాలూ రాబోయే రోజుల్లో తీసుకునే నిర్ణయాలపైనే ఆధారపడి ఉంది. ■



రాత్రి భోజనం చేసి వెంటనే పడుకునేవారు తరచూ ఉదయం బరువుగా, అలసటగా నిద్ర లేస్తుంటారు. పడుకునే ముందు తినడం వల్ల శరీరం విశ్రాంతికి బదులు జీర్ణక్రియలో నిమగ్నమై, నిద్రకు విఘాతం కలుగుతుంది. ఇది ఇన్సులిన్ స్థాయిలను పెంచి, ఆ కెలోరీలు కొవ్వుగా నిల్వ అయ్యే అవకాశాన్ని పెంచుతుంది. కార్టిసాల్ హార్మోన్ సమతుల్యతను, సహజ నిద్ర చక్రాన్ని కూడా దెబ్బతీస్తుంది. ఆలస్యంగా తినే అలవాటు క్రమంగా బరువు పెరగడానికి, అజీర్ణానికి దారితీయవచ్చు. అందుకే నిద్రకు కనీసం రెండు మూడు గంటల ముందే భోజనం ముగించండి. ఆకలిగా అనిపిస్తే తేలికపాటి పండు చాలు.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# షార్క్‌లను చూసి 'మ్యావ్' అన్న పిల్లి పిల్లలు



మినియాపొలిస్ సమీపంలోని 'మాల్ ఆఫ్ అమెరికా'లోని సీ లైఫ్ అక్వేరియంలో, తల్లి లేని సుమారు రెండు డజన్ల పిల్లి పిల్లలు ఫీల్డ్ ట్రిప్‌కు వెళ్లాయి! 'బిట్టీ కిట్టీ బ్రిగేడ్' అనే సంస్థ ఆరో ఏడాది ఏర్పాటు చేసిన ఈ విహారానికి 'టర్కీ లెగ్', 'మౌత్ ట్రాప్', 'లాటీ డాటీ' వంటి పేర్లున్న పిల్లులు వచ్చాయి. "ఫైండింగ్ నీమో" క్లౌన్‌ఫిష్ తన మీసాల దగ్గరే తిరుగుతుంటే, 'టర్కీ లెగ్' వెనక కాళ్లపై నిల్చుని అద్దాన్ని పంజాతో కొడుతూ మ్యావ్ అంది! కొన్ని 90 మీటర్ల సొరంగంలో సొరచేపలను చూస్తూ పరుగెత్తగా, మరికొన్ని నీలి వెలుతురులో హాయిగా కునుకు తీశాయి. ఈ పర్యటన వాటికి సాంఘికంగా అలవాటు పడేలా చేసి, దత్తతను సులువు చేస్తుందట!

# 'ఇరుముడి' తర్వాత రవితేజ సినిమా ఇదే!



మాస్ మహారాజా రవితేజ అభిమానులకు మరో ఆసక్తికరమైన అప్‌డేట్ వచ్చేసింది. తన తదుపరి సినిమాపై వస్తున్న వార్తలకు చిత్రబృందం అధికారిక ప్రకటనతో తెరదించింది. యువ దర్శకుడు వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో రవితేజ తన 78వ సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన వివరాలను నిర్మాణ సంస్థ బ్రిడ్స్ ప్రొడక్షన్స్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది.

**రవితేజ -- వివేక్ ఆత్రేయ కాంబోలో**

రవితేజ కెరీర్‌లో 78వ చిత్రంగా తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌కు (=78) వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహించనున్నారు. లక్ష్మణ్, శ్రీనిరావు ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. కొంతకాలంగా ఈ కాంబినేషన్‌పై ప్రచారం జరుగుతుం డగా.. తాజాగా నిర్మాణ సంస్థ అధికారిక ప్రకటనతో ఈ వార్తలకు బలం చేకూరింది. ఈ సినిమాకు సంబంధించిన టైటిల్‌ను అక్టోబరు 11న ప్రకటించనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.

కథానాయిక ఎవరు?

ఈ చిత్రంలో రవితేజ సరసన నటించబోయే కథానాయిక ఎవరు? ఇతర కీలక పాత్రల్లో ఎవరెవరు కనిపించను న్నారు? అనే విషయాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. టైటిల్ ప్రకటనతో పాటు సినిమా గురించి మరిన్ని వివరాలు వెల్లడవుతాయా? అన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. దర్శకుడు వివేక్ ఆత్రేయ తనదైన కథాకథ నంతో ఈ చిత్రాన్ని ఎలా తెరకెక్కించనున్నారో చూడాలి

# రామ్ చరణ్ కీలక నిర్ణయం.. బాలీవుడ్ దర్శకుడికి నో చెప్పారా?



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. 'ఆర్ఆర్ఆర్'తో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ఆయన, తన తదుపరి సినిమాల విషయంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. కథల ఎంపిక నుంచి దర్శకుల వరకు ప్రతి విషయంలోనూ ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే ఓ బాలీవుడ్ దర్శకుడు చెప్పిన కథకు రామ్ చరణ్ నో చెప్పారంటూ తాజాగా సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వార్తలపై పూర్తి క్లారిటీ రావలసి ఉంది. రామ్ చరణ్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌కు టాలీవుడ్‌లో ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. వీరిద్దరి కలయికలో వచ్చిన 'రంగస్థలం' బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించడంతో పాటు చరణ్ నటనకు ప్రశంసలు తెచ్చిపెట్టింది. ఇప్పుడు ఈ విజయవంతమైన జోడీ మరోసారి కలిసి పనిచేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. తాత్కాలికంగా 'ఆర్‌సీ17'గా ప్రచారంలో ఉన్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మించనున్నట్లు సమాచారం. దసరా సందర్భంగా సినిమా పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. అయితే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. తాజాగా బాలీవుడ్ దర్శకుడు అపూర్వ లఖియా, రామ్ చరణ్‌ను కలిసి ఓ కథ వినిపించారనే ప్రచారం తెరపైకి వచ్చింది. అయితే ఆ కథపై చరణ్ ఆసక్తి చూపలేదని, ప్రాజెక్టుకు అంగీకారం తెలపలేదని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం తన కెరీర్‌లో కీలకమైన దశలో ఉన్న రామ్ చరణ్, బలమైన కథలు ఉన్న సినిమాలకే ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఆయన నిజంగానే ఈ దర్శకుడి ప్రతిపాదనను తిరస్కరించారా? అందుకు కారణం ఏమిటి? అనే విషయాలపై ఇప్పటివరకు అధికారిక సమాచారం లేదు. రామ్ చరణ్, అపూర్వ లఖియా గతంలో 'జంజీర్' సినిమాతో కలిసి పనిచేశారు. అమితాబ్ బచ్చన్ నటించిన అదే పేరుతో వచ్చిన హిందీ చిత్రానికి రీమేక్‌గా ఈ సినిమా రూపొందింది. తెలుగులో 'తుఫాన్' పేరుతో విడుదలైంది. ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా కథానాయికగా నటించగా, సంజయ్ దత్, ప్రకాశ్ రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. ఈ సినిమా ఫలితం ఆయన కెరీర్‌లో ఓ చేదు అనుభవంగా మిగిలిపోయింది.



## రిలీజ్ ముందే బంపరాఫర్.. యష్‌తో డేవిడ్ రెడ్డి దర్శకుడు కొత్త సినిమా?

ఫిలిం నగర్‌లో ప్రస్తుతం ఓ సరికొత్త చర్చ జోరుగా సాగుతోంది. మంచు మనోజ్ హీరోగా బ్రిటిష్ కాలం నాటి బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న పాన్-ఇండియా పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'డేవిడ్ రెడ్డి'. ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న యువ దర్శకుడు హనుమ రెడ్డి యక్కంటి పేరు ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. అతడి తొలి సినిమా ఇంకా ప్రేక్షకుల ముందుకు రాకముందే, ఆయన పేరు కన్నడ రాకింగ్ స్టార్, పాన్-ఇండియా స్టార్ యష్‌తో ముడిపడి వినిపిస్తుండటం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. హనుమ రెడ్డి కథకు యష్ టీమ్ ఫిదా అయినట్లు తెలుస్తుంది. 'కేజీఎఫ్' 'టాక్సిక్' వంటి భారీ చిత్రాల తర్వాత యష్ చేయబోయే నెక్స్ట్ ప్రాజెక్టల జాబితాలో హనుమ రెడ్డి సినిమా కూడా చేరిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కేవలం కొత్త దర్శకుడే అయినప్పటికీ, హనుమ రెడ్డి మొదటి సినిమాకే రవి బస్రూర్, ఆచార్య వేణు, సుప్రీమ్ సుందర్ వంటి టాలెంటెడ్ అగ్ర టెక్నీషియన్లను రంగంలోకి దించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ టెక్నికల్ వాల్యూస్, సినిమా టీజర్ క్రియేట్ చేసిన ఇంపాక్ట్ చూసే యష్ స్వయంగా ఈ దర్శకుడితో చర్చలు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ విపరీతమైన బజ్ కేవలం సినిమాపై ఉన్న హైప్ కారణంగా పుట్టుకొచ్చిన గాసిప్ మాత్రమేనని కొందరు సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, దర్శకుడి విజన్ చూస్తుంటే కచ్చితంగా ఇది నిజమయ్యే అవకాశాలున్నాయని మరికొందరు బలంగా నమ్ముతున్నారు. ఈ క్రేజీ కాంబినేషన్‌పై అటు యష్ క్యాంప్ నుంచి కానీ, ఇటు హనుమ రెడ్డి వైపు నుంచి కానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఏది ఏమైనా, మంచు మనోజ్ లాంటి హీరోతో 'డేవిడ్ రెడ్డి' ద్వారా ఇండస్ట్రీని షేక్ చేయడానికి సిద్ధమవుతున్న హనుమ రెడ్డికి, రాబోయే రోజుల్లో ఏకంగా రాష్ట్రాలు దాటి పాన్-ఇండియా రేంజ్‌లో బిగ్ ఆఫర్స్ వస్తుండటం మాత్రం తెలుగు సినిమా రంగంలో సంచలనంగా మారింది. అసలు ఈ రూమర్ వెనుక నిజమెంత ఉందనేది తెలియాలంటే కొద్దిరోజులు వేచి చూడాల్సిందే.

# తాను కూడా తెలుగమ్మాయినే

దీ రాజాసాబ్ బ్యూటీ నిధి అగర్వాల్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తెలుగు పలు సినిమాల్లో హీరోయిన్‌గా చేసింది. ఈ ముద్దుగుమ్మ గతేడాది రిలీజైన ప్రభాస్ ది రాజాసాబ్ చిత్రంలో హీరోయిన్‌గా మెప్పించింది. ప్రస్తుతం సినిమాలు లేకపోయినా.. తాజాగా ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి హాజరైంది. ఈ సందర్భంగా తనకు ఓ ఆసక్తికర ప్రశ్న ఎదురైంది. తెలుగబ్బాయిని పెళ్లి చేసుకుంటారా? అని ఓ రిపోర్టర్ అడగడంతో దీనిపై స్పందించింది. అది తెలియదు.. మే బీ చేసుకోవచ్చంటూ సరదాగా నవ్వుతూ సమాధానమిచ్చింది. అంతేకాకుండా తనకు తెలుగు రాష్ట్రాలతో ఉన్న అనుబంధం గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తాను హైదరాబాద్‌లోనే పుట్టానని తెలిపారు. తాను కూడా తెలుగమ్మాయినేనని నిధి అగర్వాల్ స్పష్టం చేశారు. ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



# శర్వానంద్ భోగి.. క్రేజీ సాంగ్ రిలీజ్

టాలీవుడ్ హీరో శర్వానంద్ బైకర్ తర్వాత నటిస్తోన్న తాజా చిత్రం భోగి. ఈ మూవీకి సంపత్ నంది దర్శకత్వం వహిస్తున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం కావడంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇటీవలే టీజర్ రిలీజ్ చేయగా ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ మూవీ నుంచి క్రేజీ సాంగ్ రిలీజ్ చేశారు. ఎగిరి వరంగలేసి అంటూ సాగే పాటను విడుదల చేశారు. ఈ పాటకు చంద్రబోస్ లిరిక్స్ అందించగా..నల్గొండ గద్దర్ నర్సన్న, కందుకూరి శంకర్‌బాబు, రేలారే గోపాల్ ఆలపించారు. ఈ సాంగ్ భీమ్స్ సిసిరోలియో కంపోజ్ చేశారు. కాగా.. ఈ చిత్రాన్ని 1960ల నాటి తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు నేపథ్య కథతో రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ మూవీకి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. పీరియాడిక్ డ్రామాగా వస్తోన్న ఈ సినిమా నవంబర్ 12న థియేటర్లలో విడుదల కానుంది.



PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com